



PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 47, పేజీలు - 08
సోమవారం, జులై 21, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## రష్యాలో భారీ భూకంపం

**- రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదు**



మాస్కో (ప్రశ్న న్యూస్) రష్యాలో మూడు భూకంపాలు సంభవించాయి. నిమిషాల వ్యవధిలో భూమి ప్రకోపించింది. ఆ దేశాన్ని వణికించింది. ఈ మూడు కూడా అత్యంత శక్తిమంతమైనవే. తీర ప్రాంతం కావడం, భూకంపాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సునామీ హెచ్చరికలను జారీ చేశారు. ముందు జాగ్రత్త చర్యగా తీర ప్రాంతాలన్నింటినీ కూడా ఖాళీ చేయించారు. రష్యాలోని కమ్ చట్కా ప్రావిన్స్ రాజధాని పెట్రోపావ్లోవ్స్క్-కమ్ చట్స్కీ

2లో..

## హెూంగార్డు వద్ద గంజాయి ప్యాకెట్లు

**- షాకైన పోలీసులు**



సంగారెడ్డి (ప్రశ్న న్యూస్) సంగారెడ్డి జిల్లాలో ఓ హెూంగార్డు నుంచే గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జిల్లా కోర్టులో ఓ ఉన్నతాధికారి వద్ద విధుల్లో ఉన్న కొమ్ముల రాజు అనే హెూంగార్డు, శనివారం రాత్రి కంది ప్రాంతంలో గంజాయి ప్యాకెట్లతో బైక్ వద్ద నిలబడి ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటన శాంతిభద్రతల

2లో..

## తెలంగాణలో భారీ వర్షాలు

**- 12 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రానికి భారత వాతావరణ కేంద్రం భారీ వర్ష సూచన విడుదల చేసింది. నేడు, రేపు రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ శాఖ డైరెక్టర్ డా. కె. నాగరత్నం హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా 12 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయబడింది. ఇది ఆయా ప్రాంతాల్లో అత్యంత జాగ్రత్తగా

2లో..

## తెలంగాణ రాజకీయాల్లో అంతర్గత కుమ్ములాటలు

**- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలో కలవరం**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలలో అసమ్మతి రాగాలు సెగలు రేపుతున్నాయి. ఈ మూడు పార్టీల్లో గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలు అంతర్గతంగా తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. బీఆర్ఎస్ లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన రాజకీయ కార్యక్రమాలతో బీఆర్ఎస్ లో కాక పుట్టిస్తుండగా, బీజేపీలో ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ వాడివేడి వ్యాఖ్యలు కమలం పార్టీని కుదిపేస్తున్నాయి. ఇక అధికార కాంగ్రెస్ లో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన కామెంట్స్ హస్తం పార్టీలో దుమారాన్నే లేపుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ అంతర్గత సమస్యలను పరిష్కరించకపోతే ఈ మూడు పార్టీలకు ఇబ్బందులు తప్పవని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

### బీఆర్ఎస్‌లో కవిత ప్రకంపనలు

అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు కల్వకుంట్ల కవిత రాసిన లేఖ విడుదల కావడం, ఆ తర్వాత పార్టీలో "దయ్యాలున్నాయని" వ్యాఖ్యలు చేయడం నుంచి తెలంగాణ జాగృతి జెండా, ఎజెండా వరకు గులాబీ పార్టీలో తీవ్ర ప్రకంపనలు రేపుతున్నాయి. ఏకంగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పైనే కవిత నేరుగా అసమ్మతి అస్త్రం సంధించడం విశేషం. ఇప్పటివరకు దీనిపై పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ గాని, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గాని ఎలాంటి చర్యలు తీసుకోని పరిస్థితి ఉంది. ఇలాగే కవిత తన సొంత ఎజెండాతో పని చేసుకుంటూ పోతే చర్యలు తప్పవన్న చర్చ పార్టీలో సాగుతోంది. ఏది ఏమైనా ప్రతిపక్షంగా బలపడాల్సిన తరుణంలో ఎమ్మెల్సీ కవిత చేస్తోన్న వ్యాఖ్యలు, రాజకీయంగా వేస్తున్న అడుగులు ఆ పార్టీని ఇబ్బందులకు గురి చేస్తున్నాయని పార్టీ ముఖ్యులు అంతర్గతంగా మదనపడుతున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీ చేపట్టాల్సిన కార్యాచరణే తాను చేపడుతున్నట్లు కవిత చెబుతున్నారు. రానున్న రోజుల్లో ఈ అసమ్మతి రాజకీయం ఏ తీరం చేరుతుందో వేచి చూడాల్సిందే.

### బీజేపీలో ఈటల మాటల తూటాలు

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రేసులో ఉండి, చివరిలో తప్పిపోయినప్పటి నుండి ఎంపీ ఈటల రాజేందర్ రాజకీయంగా కొంత మౌనంగా ఉన్నారు. అయితే ఇటీవలే కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరైన

2లో..

## పార్లమెంట్ సమావేశాల వేళ ఒక్కటైన అధికార, విపక్షాలు

**- జస్టిస్ యశ్వంత్ వర్మపై మహాభియోగ తీర్మానం**
**- అధికార పార్టీకి మద్దతు ఇచ్చిన విపక్ష కాంగ్రెస్**
**- పహల్గామ్ దాడి, మణిపూర్ హింసపై విపక్షాల పట్టు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) నేటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో జస్టిస్ యశ్వంత్ వర్మ మహాభియోగ తీర్మానం, ఆపరేషన్ సిందూర్ సహా అనేక అంశాలు కీలకం కానున్నాయి. జస్టిస్ వర్మ తొలగింపునకు మహాభియోగం తీర్మానం తీసుకురానున్నట్టు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ఇప్పటికే 100కిపైగా ఎంపీలు తమ మద్దతును తెలియజేస్తూ సంతకాలు చేసినట్టు సమాచారం. మార్చి 14న హెూలీ రోజున ఢిల్లీలోని జస్టిస్ వర్మ నివాసంలో అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో భారీగా నోట్ల కట్లు బయటపడటం

2లో..

## తెలంగాణ యువతకు రాహుల్ సిప్లిగంజ్ ఆదర్శం

**- కోటి నజరానా ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్** భారతీయ సినిమా గురించి ఆ మాటకు వస్తే మన తెలుగు సినిమా గురించి ప్రపంచమంతా మాట్లాడుకునేలా చేసిన పాట 'ఆర్ఆర్ఆర్: రౌద్రం రణం రుధిరం' సినిమాలోని 'నాటు నాటు'. ఆస్కార్ సాధించిన తొలి తెలుగు పాటగా, భారతీయ పాటగా రికార్డ్ సృష్టించింది. 'నాటు నాటు' పాడిన గాయకులలో ఒకరైన తెలంగాణ యువకుడు రాహుల్ సిప్లిగంజ్ మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ యువతకు రాహుల్ సిప్లిగంజ్ ఆదర్శం అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసచారు. సొంత కృషితో అతను పైకి ఎదిగాడని పేర్కొన్నారు. ఆస్కార్ సాధించిన పాట వెనుక రాహుల్ కృషి ఉందని తెలిపారు. యువత అతడిని మార్గదర్శిగా తీసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని పేర్కొన్నారు. అంతే కాదు అతడికి కోటి రూపాయల నజరానా

2లో..

## గోషామహల్ బై పోల్‌పై తేల్చేసిన రాజాసింగ్

**- ఏ పార్టీలో చేరాలో నిర్ణయం తీసుకోలేదన్న ఎమ్మెల్యే**
**- బీజేపీ హైకమాండ్ చెబితే ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తా**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీజేపీకి రాజీనామా చేసిన రాజాసింగ్ అడుగులు ఎటు. రాజాసింగ్ రాజీనామాను బీజేపీ ఆమోదిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో, బీజేపీ సింబల్ పైన ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్ పై

2లో..

## ఏపీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం

**- ఛార్జ్‌షీట్‌లో జగన్ పేరు**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకున్న లిక్కర్ స్కామ్ కేసులో సిట్ అధికారులు దూకుడు పెంచారు. ఇప్పటికే ఈ కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిని సిట్ అధికారులు శనివారం నాడు అదుపులోకి తీసుకున్నారు. మిథున్ రెడ్డి అరెస్ట్‌కు సంబంధించి సిట్ అధికారులు శనివారం రాత్రి నోటీసులిచ్చారు. మిథున్ రెడ్డి అరెస్టుతో ఇప్పటి వరకు లిక్కర్ స్కాం కేసులో అరెస్టుల సంఖ్య 12కు చేరింది. అయితే, తాజాగా ఈ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. లిక్కర్ స్కామ్‌కు సంబంధించి సిట్ అధికారులు రూపొందించిన ఛార్జ్‌షీట్‌ని తాజాగా విజయవాడ ఏసీబీ కోర్టు ముందు దాఖలు

2లో..

## భారత్ మరో కీలక ఘనత

**- మలేరియా నివారణకు స్వదేశీ వ్యాక్సిన్**

2లో..




## విదేశీ మీడియాపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆగ్రహం

**- జూన్ 12న అహ్మదాబాద్ లో ఘోర విమాన ప్రమాదం**
**- పాశ్చాత్యదేశాల మీడియాలో ఇష్టం వచ్చినట్టు కథనాలు**
**- తుది నివేదిక వచ్చేవరకు ఓపిక పట్టాలని హితవు**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఎయిర్ ఇండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాదంపై దర్యాప్తు గురించి పాశ్చాత్య దేశాల మీడియా వివాదాస్పద, ఊహాగానాలతో కూడిన కవరేజీని ఇస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కింజరాపు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై తుది

2లో..

## ఎంపీ మిథున్ రెడ్డికి రిమాండ్

**- లిక్కర్ కేసులో రిమాండ్ విధించిన కోర్టు**




విజయవాడ (ప్రశ్న న్యూస్) ఏపీ మద్యం కుంభకోణం కేసులో వైఎస్సార్ సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఈ కేసులో ఏ4గా ఉన్న మిథున్ రెడ్డికి ఆగస్టు 1 వరకు రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలతో పోలీసులు ఎంపీ మిథున్ రెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలిస్తున్నారు. లిక్కర్ స్కామ్ కేసులో విచారణకు హాజరైన మిథున్ రెడ్డిని దాదాపు ఏడు గంటలపాటు సుదీర్ఘంగా

2లో..

## వరంగల్‌లో క్రికెట్ స్టేడియం

**- సీఎం రేవంత్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యేలు**

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు
- యంగ్ స్పోర్ట్స్ స్కూల్ ప్రస్తావన తెచ్చిన శాసనసభ్యులు
- సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర యువత, క్రీడాకారుల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నారని మరోసారి రుజువైంది. వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల బృందం, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి నేతృత్వంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వరంగల్‌లో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మించాలని విజ్ఞప్తి

2లో..

## దేశానికి జాతీయ భాష అవసరం లేదు

**హిందీ భాషా రగడపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు**

- జైపూర్ లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్
- హిందీ జాతీయ భాష కాదని, దేశంలో అనేక అధికార భాషలున్నాయని వెల్లడి
- హిందీని బలవంతంగా రుద్దుతామంటే కుదరదని స్పష్టీకరణ



హైదరాబాద్ / జైపూర్ (ప్రశ్న న్యూస్) ఉత్తర భారతదేశ ఎంపీల సంఖ్య ఆధారంగా డిసైడయ్యే కేంద్రప్రభుత్వం దక్షిణ భారతదేశ ప్రజల ప్రయోజనాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే అవకాశం ఉండదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఉత్తరప్రదేశ్ లాంటి ఒక్క రాష్ట్రం కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారడం సమాఖ్య వ్యవస్థకు మంచిది కాదని పేర్కొన్నారు. జైపూర్ లో జరుగుతున్న టాక్ జర్నలిజం 9 వ ఎడిషన్ చర్చ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ జనాభా నియంత్రణను అద్భుతంగా పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు నియోజకవర్గ పునర్విభజనలో

3లో..

# రష్యాలో భారీ భూకంపం

సమీపంలో భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1:23 నిమిషాలకుఈ మూడు భూకంపాలు సంభవించాయి. వీటిలో ఒక భూకంపం తీవ్రత 7.4గా నమోదైందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే తెలిపింది. ఈ నేపథ్యంలో సునామీ హెచ్చరిక జారీ చేశారు. 32 నిమిషాల వ్యవధిలో భూమి మూడుసార్లు కంపించింది. మొదటి భూకంపం 5.0 తీవ్రతతో సంభవించింది. దీని తర్వాత 6.7 తీవ్రతతో భూమి ప్రకోపించింది. పెట్రోపావ్లోవ్స్క్-కమ్ చట్స్కీకి తూర్పు దిశగా 151 కిలోమీటర్ల దూరంలో గల ప్రాంతాన్ని భూకంప కేంద్రంగా గుర్తించారు. ఉపరితలం నుంచి 8.7 కిలోమీటర్ల లోతులో ఫలకాల్లో చోటు చేసుకున్న పెను కదలికల వల్ల భూమి కంపించినట్లు యూఎస్జీఎస్ తెలిపింది. ఆ వెంటనే రిక్టర్ స్కేల్ పై 7.4 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఇది పెట్రోపావ్లోవ్స్క్-కమ్ చట్స్కీకి తూర్పున 144 కిలోమీటర్ల దూరంలో చోటు చేసుకుంది. ఉపరితలం నుంచి 20 కిలోమీటర్ల లోతు భూమి కంపించినట్లు అధికారులు తెలిపారు. ఈ మూడు భారీ భూకంపాల వల్ల ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం సంభవించలేదని సమాచారం అందింది. వీటి తీవ్రత నేపథ్యంలో పసిఫిక్ మహాసముద్రంలో భూకంప కేంద్రం నుండి 300 కిలోమీటర్ల పరిధిలో గల ప్రాంతాన్ని అత్యంత ప్రమాదకరంగా గుర్తించారు. ప్రమాదకరమైన సునామీ సంభవించే అవకాశం ఉందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే హెచ్చరించింది. పెట్రోపావ్లోవ్స్క్-కమ్ చట్స్కీ రీజియన్ లో 1,60,000 కంటే ఎక్కువ మంది ప్రజలు నివసిస్తున్నారు. పెట్రోపావ్లోవ్స్క్-కమ్ చట్స్కీ రష్యా సరిహద్దుల్లో ఉంటుంది. జపాన్‌కు ఈశాన్యం, అలాస్కాకు పశ్చిమం దిశగా ఉంటుందీ తీర ప్రాంతం. పసిఫిక్ మహా సముద్ర తీర ఉందిక్కడ. కమ్ చట్ స్కీ ఓ ద్వీపకల్పం. పసిఫిక్, నార్త్ అమెరికా టెక్టోనిక్ ప్లేట్‌ల పరిధిలో ఉండటం వల్ల తరచూ భూకంపాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంది. 1900 సంవత్సరం నుండి ఈ ప్రాంతంలో 8.3 లేదా అంతకంటే ఎక్కువ తీవ్రత కలిగిన ఏడు ప్రధాన భూకంపాలు సంభవించాయి. భూకంపాలకు హాట్ జోన్ గా పరిగణిస్తుంటారీ ప్రాంతాన్ని. అసాధారణ తీవ్రతతో భూకంపాలు సంభవిస్తోండటమే దీనికి ప్రధాన కారణం.

# హోంగార్డు వద్ద గంజాయి ప్యాకెట్లు

పరిరక్షణలో ఉండాల్సిన వారిలోనూ కొందరు ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే విషయాన్ని స్పష్టం చేసింది. పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకొని కొమ్ముల రాజు నుంచి 800 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.80,000 ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. సాధారణంగా అక్రమ కార్యకలాపాలను అరికట్టాల్సిన హోంగార్డు ఇలా గంజాయి వ్యాపారంలో పట్టుబడటం పోలీసు శాఖలో కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణలో కొమ్ముల రాజు ఈ గంజాయిని ఎక్కడి నుంచి తెచ్చాడు. ఎవరికి విక్రయించడానికి ప్రయత్నిస్తున్నాడు.? ఈ అక్రమ రవాణాలో ఇంకెవరైనా ఉన్నారా అనే కోణాల్లో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. సంఘటిత నేరాల ముఠాలతో అతనికి ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలోనూ విచారణ కొనసాగుతోంది. ఈ తరహా ఘటనలు పోలీసు వ్యవస్థ పారదర్శకత, జవాబుదారీతనంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఇలాంటి ఘటనలు సాధారణ ప్రజల్లో పోలీసులపై ఉన్న నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తాయి.

### మాదకద్రవ్యాల నివారణలో సవాళ్లు..

సంగారెడ్డి జిల్లాలో వెలుగుచూసిన ఈ ఘటన, తెలంగాణ రాష్ట్రంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఎంతవరకు విస్తరించిందో మరోసారి చాటి చెప్పింది. విద్యాసంస్థల పరిసరాల్లో, యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ వ్యాపారం జరుగుతున్న అనేక కేసులు గతంలోనూ నమోదయ్యాయి. ప్రభుత్వం గంజాయి సాగు రవాణాను అరికట్టడానికి ఆపరేషన్ పరివర్తన్ వంటి కార్యక్రమాలను చేపట్టినప్పటికీ, ఇలాంటి సంఘటనలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం, పోలీసు శాఖ ఈ ఘటనను సీరియస్‌గా తీసుకొని హోంగార్డు రాజు వెనుక ఉన్న ముఠాలను గుర్తించి కఠినంగా శిక్షించాలి. అంతేకాకుండా పోలీసు, హోంగార్డు సిబ్బందిలో ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెట్టి, నిరంతర తనిఖీలు, పటిష్టమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. యువతను మాదకద్రవ్యాల బారి నుంచి రక్షించడానికి అవగాహన కార్యక్రమాలు, డ్రగ్స్ వ్యసనానికి గురైన వారికి పునరావాస కేంద్రాల ఏర్పాటు వంటి చర్యలు మరింత విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉంది.

# తెలంగాణలో భారీ వర్షాలు

ఉండాలని సూచిస్తుంది. ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్, మెదక్, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, హన్మకొండ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదవుతాయని తెలిపింది. వర్షాలతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఈ నెల 24 వరకు రాష్ట్రంలో పలు చోట్ల అతి భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు మళ్లీ చురుగ్గా మారడం, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం వల్ల ఈ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం (జులై 21) పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. మంగళవారం (జులై 22) ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, మెదక్, కామారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే సూచనలున్నాయి. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల నివాసితులు, నదులు, ప్రాజెక్టుల తీర ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలి. అత్యవసరమైతే తప్ప బయట ప్రయాణాలు మానుకోవాలి. విద్యుత్ తీగలు, స్తంభాలకు దూరంగా ఉండాలి. వాహనదారులు జాగ్రత్తగా డ్రైవ్ చేయాలి, రోడ్లపై నీరు నిలిచి ఉన్న ప్రదేశాలలో నెమ్మదిగా వెళ్ళాలి. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక బృందాలకు సహకరించాలి. వాతావరణ శాఖ విడుదల చేసే సూచనలను నిరంతరం గమనించాలి. పిల్లలు, పెంపుడు జంతువుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులు సూచించారు.

# భారత్ మరో కీలక ఘనత

భారత్ మలేరియా నిర్మూలన దిశగా కీలక ముందడుగు వేసింది. భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), భువనేశ్వర్‌లోని రీజనల్ మెడికల్ రీసెర్చ్ సెంటర్ (ఆర్ఎంఆర్సీబీబీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మలేరియా రీసెర్చ్ (ఎన్ఐఎంఆర్) మరియు డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీ (డీబీటీ-ఎన్ఐఐ) సంయుక్తంగా 'అడ్‌ఫాల్సివాక్స్' అనే స్వదేశీ మలేరియా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేస్తున్నాయి. ఈ వ్యాక్సిన్ ను మలేరియాకు కారణమయ్యే అత్యంత ప్రమాదకరమైన ప్లాస్మోడియం ఫాల్సిపారమ్ పరాన్నజీవి యొక్క రెండు కీలక దశలను లక్ష్యంగా చేసుకుని రూపొందించారు.

ప్రీ-క్లినికల్ పరీక్షల్లో ఈ వ్యాక్సిన్ అద్భుతమైన ఫలితాలను చూపింది. ఇది ప్లాస్మోడియం ఒకే దశను లక్ష్యంగా చేసుకునే సాంప్రదాయ వ్యాక్సిన్‌లతో పోలిస్తే విస్తృత రక్షణను అందిస్తుందని, రోగనిరోధక వ్యవస్థ నుంచి మలేరియా పరాన్నజీవి తప్పించుకునే అవకాశం తక్కువగా ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి. దీర్ఘకాల రోగనిరోధక శక్తిని అందిస్తుందని, ఈ వ్యాక్సిన్ సాధారణ గది ఉష్ణోగ్రత వద్ద 9 నెలలకు పైగా స్థిరంగా ఉంటుందని పరీక్షలు సూచిస్తున్నాయి. ఈ వ్యాక్సిన్‌ను లాక్టోకాకస్ లాక్టిస్ బ్యాక్టీరియా ఉపయోగించి తయారు చేశారు

ఇది వ్యక్తులను రక్షించడమే కాకుండా మలేరియా వ్యాప్తిని కూడా తగ్గిస్తుంది. ఐసీఎంఆర్ ఈ వ్యాక్సిన్ టెక్నాలజీని పరిశ్రమలకు, తయారీదారులకు నాన్-ఎక్స్‌క్లూజివ్ ఒప్పందాల ద్వారా లైసెన్స్ చేయాలని యోచిస్తోంది. దీని ద్వారా విస్తృత ప్రజారోగ్య ప్రయోజనాలను సాధించడం లక్ష్యంగా ఉంది. 'మేక్ ఇన్ ఇండియా' ఉద్దేశాన్ని నెరవేర్చే ఈ స్వదేశీ వ్యాక్సిన్, మలేరియా నిర్మూలనలో కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యాక్సిన్ పరిశోధన, అభివృద్ధి దశలో ఉంది మరియు ఇంకా వాణిజ్య లేదా క్లినికల్ ఉపయోగం కోసం అందుబాటులో లేదు.

# తెలంగాణ రాజకీయాల్లో అంతర్గత కుమ్ములాటలు

తర్వాత ఆయన చేసిన కామెంట్స్‌పై బీజేపీలో రచ్చ రచ్చే నడిచింది. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి "ఏటీఎంగా మారిందని" ప్రధాని మోదీ గతంలో వ్యాఖ్యలు చేశారు. అయితే కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరైన తర్వాత ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ, "కాళేశ్వరం ప్రాజెక్టు క్యాబినెట్ అనుమతితోనే నిర్మించారు, నేను ఆర్థిక మంత్రిగా నిధుల విషయంలో మాత్రమే జోక్యం చేసుకున్నాను" అని చెప్పారు. "కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు మేలు చేసేదే, కానీ ఇందులో అవినీతి జరిగింది" అని కూడా చెప్పారు. అయితే ఇది ప్రధాని మోదీ వ్యాఖ్యలకు భిన్నంగా ఉందన్నది బీజేపీలోని కొందరి వాదన. దీనిపై వెంటనే కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ "తాము మాట మార్చేందుకు ఊసరవెల్లులం కాదని, ప్రధాని మోదీ అభిప్రాయమే పార్టీ అభిప్రాయమని" కుండబద్దలు కొట్టారు. ఇలా ఈ అంశం ఇరువురి మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది. అధ్యక్ష పదవిని ఆశించినా హైకమాండ్ నుండి అతనికి గ్రీన్ సిగ్నల్ దక్కలేదు. ఆ పదవిని రాంచందర్ రావు ఎగురేసుకుపోయారు. అప్పటి నుండి ఈటలకు ప్రాధాన్యత ఉందన్న వాదన బీజేపీలో ఉంది. ఈ క్రమంలోనే ఈటల పార్టీలోని అసంతృప్తి నేతలతో మంతనాలు జరుపుతున్నారన్న వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

### అధికార కాంగ్రెస్ లో కోమటిరెడ్డి కలకలం

బీఆర్ఎస్, బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఇలా ఉంటే, అధికార పార్టీ కాంగ్రెస్ కూడా ఇందుకు మినహాయింపు కాదని ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తేల్చి చెబుతున్నాయి. "పదేళ్లు నేనే సీఎం ఉంటా" అంటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. సీఎం పదవిని పార్టీలో "ఎవరూ శాశ్వతంగా రాయించుకోలేరని", పార్టీలో "అందరి సమిష్టి నిర్ణయమని" సీఎం రేవంత్ రెడ్డిపై కౌంటర్ అటాక్ చేశారు. ఇది "పార్టీ విధానాలకు వ్యతిరేకం" అన్నారు. పార్టీని "సామ్రాజ్యంలా భావిస్తే, పార్టీ నేతలు, కార్యకర్తలు సహించరని" చెప్పారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు "ప్రజాస్వామ్య పద్ధతిలో సీఎం ఎన్నిక ఉంటుందని" చెప్పారు. అంతే కాకుండా సీఎం పదవికి "తాను రేసులో ఉన్నానని", మంత్రి పదవి కూడా దక్కకపోవడం పట్ల "తీవ్ర అసంతృప్తి ఉన్నట్లు" రాజగోపాల్ రెడ్డి బహిరంగంగా వ్యాఖ్యానించారు. ఆయన చేసిన వ్యాఖ్యలు నేరుగా సీఎంను ఉద్దేశించినవే కావడంతో కాంగ్రెస్ లోనూ అసమ్మతి నివురుగప్పిన నిప్పులా ఉందని అర్థమవుతోంది. బీఆర్ఎస్, బీజేపీలో ఉన్నట్లే కాంగ్రెస్ లోనూ అసమ్మతి వర్గం తయారవుతోందని తెలుస్తోంది. అయితే రానున్న రోజుల్లో ఈ మూడు పార్టీలు అసమ్మతి రాగాలను ఆపేలా ఎలాంటి చర్యలు తీసుకుంటాయన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది. ఈ అసమ్మతి నేతలు సైతం పార్టీలో "ఉంటారా, వేరు కుంపటి పెడతారా" అన్న చర్చ నడుస్తోంది.

# పార్లమెంట్ సమావేశాల వేళ ఒక్కటైన అధికార, విపక్షాలు

కలకలం రేపింది. న్యాయవ్యవస్థ అవినీతిలో కూరుకుపోయినట్టు ఆరోపణలు వెల్లువెత్తడంతో సుప్రీం కోర్టు తానే స్వయంగా విచారణకు ఆదేశించగా, ముగ్గురు సభ్యుల కమిటీ ఆయనపై మహాభియోగానికి సిఫార్సు చేసింది. అయితే జస్టిస్ వర్మ దీనిని సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భారత రాజ్యాంగం ప్రకారం, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తిని తొలగించడం అనేది రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా మాత్రమే సాధ్యం. ఇది కూడా మహాభియోగ తీర్మానం ఆధారంగా మాత్రమే జరగాలి. లోక్‌సభలో కనీసం 100 మంది లేదా రాజ్యసభలో 50 మంది సభ్యుల మద్దతుతో మహాభయోగ తీర్మానం ప్రవేశపెట్టాలి. ఆ తర్వాత మెజార్టీ సభ్యుల మద్దతుతో ఆమోదం పొందాలి. ఆశ్చర్యకరమైన పరిణామం ఏమిటంటే కాంగ్రెస్ పార్టీ కూడా ఈ తీర్మానానికి మద్దతు ఇవ్వబోతున్నట్టు వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా 35 మంది కాంగ్రెస్ ఎంపీలు ఈ తీర్మానానికి సంతకం చేశారు. కిరణ్ రిజిజు మాట్లాడుతూ, " ఇది పార్టీలకు అతీత అంశం న్యాయవ్యవస్థలో అవినీతిపై ప్రతి పార్టీకి బాధ్యత ఉంది' అని అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, మణిపూర్ హింస, ట్రంప్ మధ్యవర్తిత్వ వ్యాఖ్యలు, బీహార్ ఓటర్ల జాబితా సమీక్ష వంటి అంశాలపై విపక్షం నిలదీయనుంది. మొత్తం 15 బిల్లులను ప్రభుత్వం ఈ సమావేశంలో ప్రవేశపెట్టనుంది. వీటిలో పన్నులు, నౌకాశ్రయం, క్రీడా పాలన, జియోహెరిటేజ్ పరిరక్షణ వంటి కీలక బిల్లులు ఉన్నాయి. కాంగ్రెస్ నేత, ఎంపీ గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ "పహల్గామ్ ఘటనపై ప్రధాని స్వయంగా మాట్లాడాలి. విదేశాంగ విధానంపై కూడా ప్రధానమంత్రి స్పష్టత ఇవ్వాలి. మణిపూర్ ఇంకా ఎందుకు ఇంకా వెళ్లలేదనే ప్రశ్న కూడా మాకు ఉంది" అన్నారు. సుప్రియా సూలే (ఎన్సీపీ) 'రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే, మంత్రులు అసెంబ్లీలో రమ్మీ ఆడుతున్నారు. అవినీతిపరులపై చర్యలు తీసుకోండి' అని విమర్శలు గుప్పించారు.

# ఏపీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం

చేశారు. దీనిలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేరును సిట్ అధికారులు అనేకసార్లు ప్రస్తావించారు. అయితే ఈ కేసులో ఆయన పేరును నిందితుడిగా చేర్చలేదు. ఈ కేసుకు సంబంధించి సిట్ అధికారులు మొత్తం 305 పేజీల ఛార్జ్‌షీట్‌ని దాఖలు చేశారని సమాచారం. ఈ కేసులో సిట్ అధికారులు ఇప్పటి వరకు 40 మంది వ్యక్తులు, సంస్థలను నిందితులుగా చేర్చారు. ఇదిలా తాజాగా మరో 8 మందిని నిందితులుగా పేర్కొన్నారు. మొత్తం 16 మందిపై అభియోగాలు మోపారు. అయితే, ఈ కేసుకు సంబంధించి మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేరును కూడా ఛార్జ్‌షీట్‌లో సిట్ ప్రస్తావించారు. ముఖ్యంగా లిక్కర్ పాలసీ రూపకల్పన, దాని అమలులో తీసుకున్న నిర్ణయాలు అన్నింటి గురించి నాటి ముఖ్యమంత్రి జగన్‌కు తెలుసు అని ప్రస్తావనకు వచ్చింది. అయితే ప్రస్తుతం ఆయనను నిందితుడిగా చేర్చలేదు. జగన్ పాత్రపై పూర్తి విచారణ తర్వాతే ఏ నిర్ణయం అయినా తీసుకుంటామని అధికారులు తెలియజేసినట్లు సమాచారం. అయితే ఛార్జ్‌షీట్‌లో కొత్తగా చేర్చిన 8మంది ఎవరంటే సుజల్ బెహ్రూన్, అనిల్ కుమార్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, సైమన్ ప్రసన్, బొల్లారం శివకుమార్, కొమ్మారెడ్డి అవినాష్ రెడ్డి, మోహన్ కుమార్‌లను నిందితులుగా చేర్చింది. ఇదిలా ఉంటే లిక్కర్ స్కాం కేసుకు సంబంధించి మరోవైపు మిథున్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. అయితే దాన్ని ఇటు ఏపీ హైకోర్టు, అటు సుప్రీంకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరించటంతో మిథున్ రెడ్డి సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం సిట్ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. లిక్కర్ స్కామ్ కేసులో నిందితుల సంఖ్య 48కి చేరినట్లు సిట్ అధికారులు తెలిపారు.

### లిక్కర్ స్కామ్ కేసులో సిట్ దూకుడు

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గతేడాది ఏపీ సీఐడీలో మద్యం కుంభకోణంపై కేసు నమోదైంది. లిక్కర్ పాలసీ స్కామ్ కేసును దర్యాప్తు చేసేందుకు విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆధ్వర్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 5న ఏపీ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. కేసు దర్యాప్తులో భాగంగా పలువుర్ని విచారించిన సిట్ ఏప్రిల్ 22న లిక్కర్ స్కామ్ లో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డిని అరెస్టు చేసింది. తర్వాత కేసులో కీలకంగా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ ధనుంజయరెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్న గోవిందప్ప బాలాజీ, మాజీ సీఎం జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎస్పీవై డిస్టిలరీస్ మాజీ డైరెక్టర్ సజ్జల శ్రీధర్‌రెడ్డితో పాటు రాజ్ కెసిరెడ్డి అనుచరులైన పైలా దిలీప్, బూనేటి చాణక్య, అనంతరం చెవిరెడ్డి భాస్కరరెడ్డి స్నేహితుడు వెంకటేశ్ నాయుడు, పీఏలు బాలాజీ యాదవ్, నవీన్ కృష్ణలను సిట్ అధికారులు అరెస్టు చేశారు. విచారణకు హాజరైన ఎంపీ మిథున్‌రెడ్డిని శనివారం (జులై 19న) అరెస్టు చేయడంతో ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టులు 12కి చేరాయి.

# గోషామహల్ బై పోల్‌పై తేల్చేసిన రాజాసింగ్

అనర్హత వేటు వేయాలని కోరుతూ స్పీకర్ కు లేఖ రాసేందుకు పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాగా, ఇదే సమయంలో రాజాసింగ్ శివసేనలో చేరుతారంటూ పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. వీటి పైన రాజాసింగ్ స్పష్టత ఇచ్చారు.

కొత్తగా చేరే పార్టీతో పాటుగా గోషామహల్ కు ఉప ఎన్నిక అంశం పైన రాజాసింగ్ తేల్చి చెప్పారు. బీజేపీ నుంచి బయటకు వచ్చిన రాజాసింగ్ రాజకీయ భవిష్యత్ ఏంటి. గోషామహల్ బాధ్యతలను రాజాసింగ్ స్థానంలో మాధవీలత కు ఇస్తారనే ప్రచారం సాగుతోంది. ఈ సమయంలో రాజాసింగ్ స్పష్టత ఇచ్చారు. తాను ఏ పార్టీలో చేరే అంశం పైన ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. తన ఎమ్మెల్యే పదవి పైన బీజేపీ నాయకత్వానిదే తుది నిర్ణయమని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయమని బీజేపీ సూచిస్తే, తాను సిద్దంగా ఉన్నానని స్పష్టం చేసారు. తాను చివరి శ్వాస వరకు హిందూత్వం కోసం పోరాటం చేస్తానని తేల్చి చెప్పారు. బీజేపీ అధినాయకత్వం పైన తనకు ఎలాంటి వ్యతిరేక భావం లేదని చెప్పుకొచ్చారు.

ఇక, సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో రాజాసింగ్ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ బోనాల శుభాకాంక్షలు తెలిపారు. వేలాదిమంది సింహవాహిని అమ్మవారి దర్శనం కోసం వస్తున్నారని చెప్పుకొచ్చారు. యావత్ భారతదేశంలో ఉండే హిందువుల అందరిపై సింహవాహిని అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నానని అన్నారు.

దర్శనం అనంతరం ఓ మంత్రి తనతో మాట్లాడారని తెలిపారు. ఏ పార్టీలో ఉన్నా అందరి లక్ష్యం ఒకటేనని, మోడల్ గోశాల కట్టడానికి తన సహకారం కావాలని ఆ మంత్రి తనను కోరారని చెప్పుకొచ్చారు. సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయాన్ని వైభవం గా కడతామని గత ప్రభుత్వాలు గుడిపై రాజకీయం చేశారని విమర్శించారు ఎమ్మెల్యే రాజాసింగ్.

## విదేశీ మీడియాపై కేంద్రమంత్రి

# రామ్మోహన్ నాయుడు ఆగ్రహం

నివేదిక వెలువడే వరకు ఎటువంటి వ్యాఖ్యలు చేయకుండా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. జూన్ 12న అహ్మదాబాద్‌లో జరిగిన ఈ ఘోర ప్రమాదంలో 260 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనపై భారత విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) నిర్వహిస్తున్న దర్యాప్తులో బ్లాక్ బాక్స్ డేటాను విజయవంతంగా డీకోడ్ చేసినందుకు మంత్రి నాయుడు ఏఏఐబీని ప్రశంసించారు. "గతంలో బ్లాక్ బాక్స్ దెబ్బతిన్న సందర్భాల్లో డేటాను పొందేందుకు విదేశాలకు పంపేవారు. కానీ ఈసారి ఏఏఐబీ భారతదేశంలోనే దీన్ని సాధించడం గొప్ప విజయం" అని ఆయన అన్నారు. ప్రాథమిక నివేదిక కూడా సిద్ధమైందని, అయితే తుది నివేదిక వచ్చే వరకు ఎటువంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమ దేశాల మీడియా, ముఖ్యంగా వాల్ స్ట్రీట్ జర్నల్ మరియు రాయిటర్స్ వంటి సంస్థలు, పైలట్లపై నిందలు వేస్తూ, ఆధారాలు లేని కథనాలను ప్రచురిస్తున్నాయని మంత్రి ఆరోపించారు. "ఏఏఐబీ అందరినీ, ముఖ్యంగా విదేశీ మీడియా సంస్థలను, వాటి స్వప్రయోజనాల కోసం ఇలాంటి కథనాలు ప్రచురించకుండా ఉండాలని కోరింది" అని ఆయన చెప్పారు. అమెరికా జాతీయ రవాణా భద్రతా మండలి (ఎన్టీఎస్బీ) చైర్‌పర్సన్ జెన్నిఫర్ హోమెండీ కూడా ఈ కథనాలను అకాల, ఊహాగానాలతో కూడినవిగా విమర్శించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు కొనసాగుతోందని, ఎన్టీఎస్బీ భారత దర్యాప్తు సంస్థకు సహకరిస్తుందని ఆమె తెలిపారు. ఏఏఐబీ జూలై 17న జారీ చేసిన ఒక ప్రకటనలో, కొన్ని అంతర్జాతీయ మీడియా సంస్థలు ధృవీకరించని కవరేజీని ఇస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. మంత్రి రామ్మోహన్ నాయుడు మీడియాను ఓపికగా ఉండాలని, తుది నివేదిక కోసం వేచి ఉండాలని కోరారు. "అందరూ జాగ్రత్తగా ఉండాలి. దర్యాప్తు పూర్తయ్యే వరకు ఊహాగానాలు చేయడం సరికాదు" అని ఆయన అన్నారు.

# తెలంగాణ యువతకు రాహుల్ సిప్లిగంజ్ ఆదర్శం

కూడా ప్రకటించారు. గద్దర్ అవార్డులో ప్రకటించిన సమయంలోనూ రాహుల్ సిప్లిగంజ్ గురించి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా మాట్లాడారు. అతడికి పురస్కారం ఏమీ రాలేదని, భవిష్యత్తులో ఏదైనా చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం చిత్రసీమకు ఎటువంటి అవార్డులు ఇవ్వలేదు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గద్దర్ అవార్డులు ప్రకటించారు. గతేడాది విడుదలైన అన్ని సినిమాలలో అన్ని విభాగాలకూ అవార్డులు ఇచ్చారు. పదేళ్ల కాలంలో ప్రతి ఏడాది విడుదలైన సినిమాల్లో కేవలం సినిమా విభాగంలో అవార్డులు ఇచ్చారు తప్ప మిగతా విభాగాలలో ఎటువంటి ఆ పురస్కారాలు ఇవ్వలేదు. అందువల్ల ఇప్పుడు రాహుల్ సిప్లిగంజ్ పంట పండింది. 'నాటు నాటు' పాటకు ఆస్కార్ వచ్చి రెండేళ్లు దాటింది. ఇప్పుడు పాట పాడిన గాయకుడికి తెలంగాణ ప్రభుత్వం నజరానా ప్రకటించడం విశేషం. ఆస్కారం వచ్చిన సమయంలో తెలంగాణలో కల్వకుంట్ల చంద్రశేఖర రావు నేతృత్వంలోనే భారతీయ రాష్ట్ర సమితి పార్టీ అధికారంలో ఉంది ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అతడికి నజరానా ప్రకటించారు. 'ఆర్ఆర్ఆర్: రౌద్రం రణం రుధిరం' సినిమాకు సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి తనయుడు, యువ స్వరకర్త కాలభైరవ కూడా రాహుల్ సిప్లిగంజ్‌తో కలిసి ఆ పాట పాడారు.

# ఎంపీ మిథున్ రెడ్డికి రిమాండ్

విచారించిన అనంతరం శనివారం సాయంత్రం సిట్ అధికారులు ఆయనను అరెస్ట్ చేశారని తెలిసిందే. ఆదివారం మధ్యాహ్నం విజయవాడ ఏసీబీ కోర్టులో మిథున్ రెడ్డిని హాజరుపరిచారు. అంతకు ముందు సిట్ ఆఫీసు నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి ఎంపీ మిథున్ రెడ్డిని తీసుకెళ్లారు. బీపీ, షుగర్, ఈసీజీ వంటి సాధారణ వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆయనకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని డాక్టర్లు నిర్ధారించడంతో సిట్ అధికారులు మిథున్ రెడ్డిని విజయవాడలోని ఏసీబీ కోర్టు జడ్జి ఎదుట హాజరు పరిచారు. మిథున్ రెడ్డిపై సెక్షన్ 409, 420, 120(బీ), రెడ్ విత్ 34, 37, ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ సెక్షన్లు 35 7, 72, 8, 13(1)(2), 13(2) కింద కేసు నమోదు చేసినట్లు సిట్ కోర్టుకు నివేదించింది. సిట్ తరఫున కోటేశ్వరరావు, ఎంపీ మిథున్ రెడ్డి తరఫున నాగార్జున రెడ్డి వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న ఏసీబీ కోర్టు ఆగస్టు 1 వరకు రిమాండ్ విధించింది. ఎంపీ మిథున్ రెడ్డిని పోలీస్ కస్టడీకి తీసుకోవాల్సి ఉందని ఆయనను గుంటూరు సబ్ జైలుకు తరలించాలని సిట్ లాయర్ కోరారు. వై కేటగిరి సెక్యూరిటీ ఉన్న నేత, ఎంపీ మిథున్ రెడ్డి అని ఆయనకు రిమాండ్ విధిస్తే నెల్లూరు జైలులో ప్రత్యేక బ్యారక్ ఇవ్వాలని ఎంపీ తరఫు లాయర్ కోరారు. ప్యానెల్ స్పీకర్ గా పనిచేసిన మిథున్ రెడ్డి అరెస్టుపై స్పీకర్ కు సమాచారం ఇవ్వలేదని కోర్టుకు తెలిపారు.

# వరంగల్‌లో క్రికెట్ స్టేడియం

చేశారు. ఈ విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించి వెంటనే అధికారులను విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

### వరంగల్ క్రీడాభివృద్ధికి ఎమ్మెల్యేల కృషి..

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ వద్ద ఉన్న సీఎం నివాసంలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, మామిడాల యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. రాష్ట్రంలో యువతకు నాణ్యమైన విద్య, క్రీడా ప్రోత్సాహం అందించడంలో సీఎం తీసుకుంటున్న చర్యలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ జిల్లా నుంచి ఇప్పటికే అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించారని కొందరు అర్జున, ద్రోణాచార్య అవార్డులు కూడా పొందారని ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం వరంగల్‌లో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం మాత్రమే ఉందని, అయితే అది పెరుగుతున్న జనాభా, క్రీడాకారుల అవసరాలను తీర్చలేకపోతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో హనుమకొండ జిల్లాలో తెలంగాణ క్రీడా పాఠశాల ఏర్పాటుతో పాటు ప్రత్యేకంగా ఒక క్రికెట్ స్టేడియం నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. దీనికోసం అవసరమైన 30 ఎకరాల కూడా భూమి ధర్మసాగర్ మండలం ఉన్నికిచెర్ల గ్రామంలో జాతీయ రహదారి 163కి ఆనుకుని అందుబాటులో ఉందని వారు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు.

### వరంగల్ అభివృద్ధికి సీఎం హామీ..

వరంగల్ నగరం హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో రెండవ అతిపెద్ద నగరంగా ఉత్తర తెలంగాణలో విద్యా, వైద్య, ఇంజనీరింగ్, నిట్, కాకతీయ యూనివర్సిటీ వంటి విద్యా కేంద్రాలతో వేగంగా అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. యువతలో క్రికెట్‌పై ఉన్న అపారమైన ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని, వరంగల్‌లో ఒక ప్రత్యేక క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉందని వివరించారు. సీఎం ఇప్పటికే చేపడుతున్న నగర అభివృద్ధి చర్యలలో భాగంగా క్రికెట్ స్టేడియం మంజూరైతే, అది వరంగల్ నగరానికి ఒక మణిహారంగా మారుతుందని తెలిపారు. ఎమ్మెల్యేల విజ్ఞప్తిని సానుకూలంగా స్వీకరించిన సీఎం రేవంత్ రెడ్డి, తక్షణమే సంబంధిత శాఖ సెక్రటరీతో ఫోన్‌లో మాట్లాడారు. వరంగల్‌లో క్రీడా పాఠశాల, క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి, తగిన విధివిధానాలను రూపొందించాలని ఆదేశించారు. వరంగల్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని.. త్వరలోనే క్రీడా పాఠశాల, క్రికెట్ స్టేడియం మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటానని సీఎం హామీ ఇచ్చారు. ఈ హామీతో వరంగల్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టులు వరంగల్ క్రీడా రంగానికి కొత్త ఉత్సాహాన్ని అందించి, భవిష్యత్తులో అనేక మంది ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దే అవకాశం ఉంది.

## మతిస్థిమితం లేక పురుగుల మందు తాగి ఆత్మహత్య



మరికల్ : మతిస్థిమితం లేక ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ మజీద్ కథనం మేరకు.. మండలంలోని పల్లెగడ్డ గ్రామానికి చెందిన కాటకొండ రాములు (47)కు కొన్ని రోజులుగా మతిస్థిమితం లేదని తెలిపారు. ఆదివారం తన వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా గ్రామస్థులు గమనించి హుటాహుటినా మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ,ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

# ఈ పండ్లను మీరు ఎక్కడ చూసినా సరే.. విడిచిపెట్టకుండా తెచ్చుకుని తినండి.. ఎందుకంటే..?



మార్కెట్‌లో మనకు అనేక రకాల పండ్లు దర్శనమిస్తుంటాయి. కొన్ని రకాల పండ్లను చూస్తాం కానీ అవి అందించే ప్రయోజనాలు తెలియవు. అలాంటి పండ్లలో ప్యాషన్ ఫ్రూట్ కూడా ఒకటి. దీన్ని చాలా మంది చూసే ఉంటారు. లోపలంతా గుజ్జు లాంటి నిర్మాణాన్ని కలిగి ఉంటుంది. ఈ పండు నారింజ పండులా అనిపిస్తుంది. ప్యాషన్ ఫ్రూట్ వాస్తవానికి మనకు ఎంతో మేలు చేస్తుంది. దీన్ని తరచూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. శరీరానికి అనేక పోషకాలు లభిస్తాయి. ప్యాషన్ ఫ్రూట్‌ను 100 గ్రాముల మోతాదులో తింటే సుమారుగా 97 క్యాలరీల శక్తి లభిస్తుంది. ఇందులో 73 గ్రాముల మేర నీరు ఉంటుంది. 23 గ్రాముల పిండి పదార్థాలు, 10 గ్రాముల ఫైబర్, ప్రోటీన్లు 2 గ్రాములు ఉంటాయి. స్వల్ప మోతాదులో కొవ్వులు, విటమిన్లు సి, ఎ, బి9, కె, బి2, బి3, బి6లతోపాటు పొటాషియం, ఐరన్, మెగ్నిషియం, ఫాస్ఫరస్, జింక్, కాపర్, సెలీనియం అధిక మొత్తంలో ఉంటాయి. అందువల్ల పోషకాహార లోపంతో బాధపడుతున్నవారు ఈ పండ్లను తింటే ఎంతో మేలు జరుగుతుంది.

### గుండె ఆరోగ్యానికి..

ప్యాషన్ ఫ్రూట్‌లో అనేక యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్ సి అధిక మొత్తంలో ఉంటుంది. బీటా కెరోటిన్, పాలిఫినాల్స్ కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీని వల్ల శరీరంలో అంతర్గతంగా వచ్చే వాపులు తగ్గుతాయి. కణాలు రక్షించబడతాయి. గుండె జబ్బులు, క్యాన్సర్ రాకుండా చూసుకోవచ్చు. ఈ పండ్లలో ఫైబర్ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది మలబద్దకాన్ని తగ్గిస్తుంది. కొలెస్ట్రాల్‌ను బయటకు పంపిస్తుంది. ఈ పండ్లను తినడం వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం మెరుగు పడుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. ఈ పండ్లను తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. బరువు తగ్గాలనుకునేవారు రోజూ ఈ పండ్లను తింటుంటే ఎంతగానో మేలు జరుగుతుంది.

### రోగ నిరోధక శక్తికి..

ప్యాషన్ ఫ్రూట్‌లో విటమిన్ సి అధికంగా ఉంటుంది కనుక రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తెల్ల రక్త కణాల సంఖ్య పెరుగుతుంది. దీని వల్ల శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. సీజనల్ గా వచ్చే ఇన్‌ఫెక్షన్లతోపాటు దగ్గు, జలుబు వంటి శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ పండ్లలో అధికంగా ఉండే పొటాషియం బీపీని నియంత్రిస్తుంది. హైబీపీ ఉన్నవారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. ఈ పండ్లను తింటే కొలెస్ట్రాల్ తగ్గి రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. దీంతో గుండె పోటు రాకుండా అడ్డుకోవచ్చు. గుండెకు ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి.

### కంటి చూపుకు..

ఈ పండ్లలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి కనుక షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. షుగర్‌ను నియంత్రణలో ఉంచుకునేందుకు సహాయం చేస్తాయి. ఈ పండ్లను తింటే విటమిన్ ఎ సమృద్ధిగా లభిస్తుంది. ఇది కంటి చూపును మెరుగు పరుస్తుంది.

కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. వయస్సు మీద పడడం వల్ల కళ్లలో వచ్చే శుక్లాలు రాకుండా చూస్తుంది. ప్యాషన్ ఫ్రూట్‌ను తినడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. మైండ్ రిలాక్స్ అవుతుంది. రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది.

నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. ఇలా ప్యాషన్ ఫ్రూట్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# దేశానికి జాతీయ భాష అవసరం లేదు

తీవ్ర నష్టం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. మంద బలం, అధికారం ఉందని జాతీయ భాషగా హిందీని బలవంతంగా రుద్దుతామంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఈ విషయంలో తెలంగాణలోని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఏకాభిప్రాయంతోనే ఉన్నాయని స్పష్టం చేశారు.

### బీజేపీ ఇష్టం వచ్చినట్లు చేస్తే కుదరదు..

కేటీఆర్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ఉందన్న కేటీఆర్, తనకు ఇష్టం వచ్చినట్లు చేస్తానని బిజెపి అనుకుంటే దాని పరిణామాలకు ఆ పార్టీనే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియాలో అర్హత కలిగిన ఏ ఒక్క వ్యక్తి కూడా ఓటు హక్కును కోల్పోకూడదు. బిహార్ లో జరుగుతున్న ఎన్నికల ఓటర్ల సవరణ మొదటిసారి కాదు. ఈసారి మాత్రం తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల కమిషన్ ఏం చేస్తుంది? బిహార్ లో జరుగుతున్న పరిణామాలపై మాకు చాలా అభ్యంతరాలు ఉన్నాయి. మిగతా రాష్ట్రాలపై ఇది ప్రభావం చూపనుంది.రాజకీయ లబ్ధి కోసం ఎన్నికల్లో గెలవడం కోసం ప్రజల మధ్య విభేదాలు , విద్వేషాలు సృష్టించడం చాలా సులభం. వారు, మనము అని ప్రజలను విడగొట్టే రాజకీయ కుట్రలకు అనుగుణంగా బిహార్ పరిణామాలు ఉన్నాయి. ప్రజలు రోడ్ల మీదకు వచ్చి ఆందోళన , నిరసన తెలపనంత మాత్రాన అంతా బాగుందని కాదు. ఓటర్లు రాజకీయ పార్టీలు, వ్యవస్థ మీద చాలా అసంతృప్తిగా ఉన్నారు. నగరాల్లో ఓటింగ్ శాతం చాలా తక్కువగా ఉండడం ఇందుకు ఒక కారణం. ఎన్నికల తరువాత ఫలితాల మీద మాట్లాడటం కంటే ఎన్నికలకు ముందే వాటిపై దృష్టి పెట్టాలి. ఇండియా లాంటి అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఒక్క వ్యక్తి ఓటు కోల్పోయిన కూడా దానిమీద చర్యలు తీసుకోవాలి. బిహార్లో ఐదు లక్షల మంది ఓట్లు గల్లంతు అంటున్నారు. ఇది ఆందోళన కలిగించే విషయం.

### తక్కువ ఓట్ల తేడాతో అధికారం కోల్పోయిన ఆర్జేడీ

గత ఎన్నికల్లో కేవలం 12,500 ఓట్ల తేడాతోనే అక్కడ ఆర్జెడి అధికారాన్ని కోల్పోయింది. భారతీయత మాత్రమే కోట్లాదిమందిని కలిపి ఉంచగలుగుతుంది. ముందు దేశం ఆ తర్వాతే ప్రాంతం, మతం, కులం. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజల సమస్యలను పార్లమెంట్లో మరింత సమర్థవంతంగా వినిపించడానికే రాజ్యాంగంలో నియోజకవర్గాల పునర్విభజన ఉంది. ప్రతి రాష్ట్రానికి ఉన్న జనాభా ఆధారంగా పార్లమెంటులో ఆ రాష్ట్ర నుంచి ప్రాతినిధ్యం ఉండాలని గతంలో పునర్విభజన జరిగేది. అందుకే గతంలో ప్రతి 10 ఏళ్లకు జనగణన, ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజన జరిగేది.జనాభా విపరీతంగా పెరగడం కారణంగా 1971 లో రాజ్యాంగ సవరణ చేసి భారత పార్లమెంటు స్థానాలను 543 దగ్గర ఫ్రీజ్ చేశారు. 30 ఏళ్ల తర్వాత మళ్లీ నియోజకవర్గ పునర్విభజన. ఈలోపు ఫ్యామిలీ ప్లానింగ్ అమలు చేయాలని అన్ని రాష్ట్రాలకు భారత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దక్షిణ భారతదేశంలో కుటుంబ నియంత్రణలో పకడ్బందీగా అమలు చేశారు. అందుకే 1948లో 26 శాతంగా ఉన్న సౌత్ ఇండియా పాపులేషన్ 19 శాతానికి తగ్గింది.

### ఫ్యామిలీ ప్లానింగ్ లో ఉత్తరాది రాష్ట్రాలు ఫెయిల్

ఉత్తర భారత దేశంలో ఫ్యామిలీ ప్లానింగ్ సరిగా అమలు చేయలేక ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో 1950 నుంచి ఇప్పటివరకు 239 శాతం జనాభా పెరిగింది. అదే కేరళలో 69 శాతం మాత్రమే పెరిగింది. దేశ అభివృద్ధి, సంక్షేమం కోసం ఫ్యామిలీ ప్లానింగ్ ను అద్భుతంగా అమలుపరిచిన కేరళ లాంటి దక్షిణాది రాష్ట్రాలకు నియోజకవర్గ పునర్విభజనలో తక్కువ సీట్లు కేటాయించడం అన్యాయం కాదా? యూపీ లాంటి ఫ్యామిలీ ప్లానింగ్ సరిగా అమలు చేయని రాష్ట్రాలకు పార్లమెంట్లో ప్రాతినిధ్యం పెంచి దక్షిణాదికి తగ్గిస్తామనడం సమాఖ్య వ్యవస్థకు మంచిది కాదు.

### చెన్నైలో మా అభిప్రాయం వెల్లడించాం

నియోజకవర్గాల పునర్విభజనలో జరుగుతున్న అన్యాయంపై కాంగ్రెస్ తో పాటు బిఆర్ఎస్ కూడా ఒకే అభిప్రాయంతో ఉంది. అందుకే మొన్న చెన్నైలో జరిగిన సమావేశంలో ఒకే అభిప్రాయాన్ని వ్యక్తం చేసాం. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ముందుగా అందుబాటులో ఉండేది ఎమ్మెల్యేనే. అందుకే ఎమ్మెల్యే స్థానాలను పెంచాలన్నదే మా పార్టీ అభిప్రాయం. ఇప్పుడున్న ఎంపీ స్థానాలని అలానే కొనసాగించాలి. ప్రధానిని ఉత్తర భారతదేశం నిర్ణయించాల్సి వస్తే.. రేపు ఆ ప్రభుత్వం ఆ ప్రాంతం ప్రయోజనాలకు అనుకూలంగానే నిర్ణయాలు తీసుకుంటుంది. దక్షిణాది అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోరు.నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాదికి అన్యాయం జరగనివ్వమని కేంద్రం ప్రభుత్వం చెబుతున్న మాటల్ని మేం నమ్మడం లేదు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో తెలంగాణ, ఏపీలో ఎమ్మెల్యే స్థానాలు పెంచుతామని ఇప్పటివరకు చేయలేదు. కానీ ఎవరు అడగకముందే వారి రాజకీయ ప్రయోజనాల కోసం జమ్ము కాశ్మీర్, అస్సాంలో మాత్రం అసెంబ్లీ సీట్లను పెంచారు. పార్లమెంట్ సాక్షిగా చట్టం చేసిందో అక్కడ మాత్రం ఎమ్మెల్యే స్థానాలను పెంచలేదు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో భారత ప్రభుత్వం ఇప్పటివరకు ఒక సమావేశాన్ని కూడా ఏర్పాటు చేయలేదు. ఉత్తర భారత దేశంలో ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా , ఆర్జెడి నేత తేజస్వి యాదవ్ అంటే నాకు అభిమానం. దక్షిణ భారతదేశం నుంచి శశిధరూర్ కి మంచి భవిష్యత్తు ఉంది. అతను కాషాయం వైపు వెళ్తున్నారు.

### జాతీయ భాష అవసరం లేదు..

దేశానికి ఒక జాతీయభాష ఉండాల్సిన అవసరం లేదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశం అద్భుతంగా పురోగమిస్తుంది. ప్రతి 250 కిలోమీటర్లకు మనదేశంలో భాషా, సంస్కృతి ,ఆహారం, వేషభాషలు మారుతాయి. ఈ విషయంలో యూరప్ నకు ఇండియాకు చాలా దగ్గర పోలికలు ఉన్నాయి. ఎన్ని వైరుధ్యాలు ఉన్నా మనం ఇంకా కలిసే ఉన్నాము. జాతీయ భాష చేస్తే తక్కువ ప్రజలు మాట్లాడే భాషలు కాలక్రమంలో కనుమరుగు అవుతాయి. చాలా దేశాల్లో ఇంగ్లీష్ మాట్లాడుతారు. ఇంగ్లీష్ తోనే అవకాశాలు లభిస్తాయి. హిందీ నేర్చుకొని అమెరికా, ఇంగ్లాండ్ లాంటి దేశాలకు వెళ్తే ప్రయోజనం ఉంటుందా ' అని కేటీఆర్ ప్రశ్నించారు.

# సమస్యలకు కేరాఫ్ అడ్రస్‌గా గ్రామాలు, తండాలు.. ప్రత్యేకాధికారుల పాలనలో రోగాల బారిన ప్రజలు

మరిపెడ: గ్రామాల్లో రోజు రోజుకు ప్రజల సమస్యలు పట్టించుకునేవారే కరువవుతున్నారు. గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్య లోపంతో గ్రామాల ప్రజలు, తండాలలో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలు, తండాల్లో పరిశుభ్రత లోపించి దోమలు స్వైర విహారం చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. మురుగు కాలువల్లో క్రిమి సంహారక మందు స్ప్రే చేయడం, ఫాగింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదని ఆరోపిస్తున్నారు.గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తమై మురికి కూపాలుగా మారుతున్నాయి. ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. మురికి కాల్వలను శుభ్రపరచడం, పిచ్చిమొక్కలను తొలగించడం, వీధులను ఊడ్చడం, నీటి ట్యాంకులను శుభ్రం చేయడం, తాగునీటి పైపులైన్ల లీకేజీలను సరిచేయడం లాంటివి అధ్వానంగా తయారైంది.

### బురద గుంటలుగా మారిన రోడ్డు..



మరిపెడ మండలంలోని కోట్యి తండాలో మంచి నీళ్ల బోరు 24 గంటలు నడవడంతో నీరు వృథాగా రోడ్డుపై పారి రోడ్డు ధ్వంసం కావడంతో పాటు బురద గుంటలుగా మారింది. తాళ్ళ ఊకల్ రెవెన్యూ పరిధిలోని పాంబండ తండా గ్రామపంచాయితీ నిర్వహణ మరి అద్వానంగా ఉంది. గ్రామపంచాయితీ కార్యాలయం ఆవరణం చెత్త, చెదారంతో నిండి ఉంది. గ్రామపంచాయితీ కార్యాలయం లేదా పాడుబడ్డ భవనంలా ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అనేపురం రెవెన్యూ ఎలమంచలి తండాలో పరిస్థితి మరి దారుణంగా ఉంది, తండాలో కనీసం మురికి నీరు ప్రవహించడానికి సైడ్ కాల్వలు లేకపోవడంతో వర్షం పడిన నీరు అంతా రోడ్డుపై ఉండంతో

## రాయపోల్‌లో బ్రహ్మకమలం పువ్వుల సందడి



రాయపోల్ : సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రానికి చెందిన సత్తు గారి తిరుపతి రెడ్డి ఇంట్లో ఒక్కటి కాదు రెండు కాదు ఏకంగా ఐదు బ్రహ్మకమలం పువ్వులు వికసించాయి. ఆదివారం ఉదయం చెట్టుకు ఐదు బ్రహ్మకమలం పువ్వులు వికసించాయి. అరుదుగా పూసే ఈ బ్రహ్మకమలం పువ్వులు సంవత్సరానికి ఒకసారి మాత్రమే పూస్తాయి.రాయపోల్ మండల కేంద్రానికి చేందిన తిరుపతి రెడ్డి తన ఇంటి ఆవరణలో వివిధ రకాల మొక్కలు పెంచుతుండగా.. అందులో బ్రహ్మకమలం పూలు పూయడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కానీ బ్రహ్మకమలం పూలు శనివారం అర్ధరాత్రి 12 గంటలకు పూసి తర్వాత ఉండవని పలువురు పేర్కొన్నారు. కాగా చాలా తక్కువగా చిగురించే బ్రహ్మకమలం పూలు.. అందులోనా ఒకేసారి ఐదు బ్రహ్మకమలం పూలు చిగురించడం పట్ల కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. వాటికి ప్రత్యేక పూజలు చేశారు.

## హెూమ్‌సిక్ సెలవులకు వచ్చి.. మృత్యు ఒడికి చేరిన విద్యార్థి



దండేపల్లి : హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఇటీవలే కళాశాల హెూమ్‌సిక్ సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చిన అతడిని రోడ్డు ప్రమాదం కబళించింది. వివరాల్లోకి వెళితే లక్షెట్టిపేట పట్టణానికి చెందిన రుద్ర వంశీకృష్ణ (16) ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరాడు.కళాశాల హెూంసిక్ సెలవులు మంజూరు చేయడంతో ఇంటికి వచ్చిన అతడు ఆదివారం తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనాలపై దండేపల్లి మండలంలోని గూడెం మేదరిపేట రింగురోడ్డు గుండా బయలు దేరారు. నంబాల గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బావిలోకి పడి పోయింది. దీంతో అతడు బావిలో మునిగిపోయాడు.అతడి వెనుక కూర్చున్న స్నేహితుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సెలవుల కోసం ఇంటికి వచ్చి సంతోషంగా గడిపే సమయంలోనే విషాద ఘటన చోటుచేసుకుంది. 8 నెలల క్రితం తండ్రి మరణించడం, ఇప్పుడు చేతికందిన కొడుకు మరణించడం కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లి రుద్ర నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తహసీనుద్దీన్ తెలిపారు.

## రక్తదానానికి యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలి



ఊట్కూర్ : నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో శక్తి ఫౌండేషన్ 5 వ వార్షికోత్సవం సందర్భంగా యువకులు ఆదివారం రక్తదానం చేశారు. శక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతనపల్లి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని నారాయణపేట యశోద కేర్ హాస్పిటల్ ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రీతి రెడ్డి , సింగిల్ విండో చైర్మన్ బాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సూర్యప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.డాక్టర్ ప్రీతి రెడ్డి మాట్లాడుతూ.. రక్త దానంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. ముఖ్యంగా గర్భిణులకు ప్రసవ సమయంలో రక్తం అత్యవసరమవుతుందని పేర్కొన్నారు. రక్తదానం చేసేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. శక్తి ఫౌండేషన్ ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం అభినందనీయమని పేర్కొన్నారు.ఫౌండేషన్ అధ్యక్షుడు శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో 25 వేల మంది రోగులకు అత్యవసర సమయంలో తెల్ల రక్త కణాలు, ప్లాస్మా, రక్తదానం చేశామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. రక్తదానం చేసిన యువకులకు శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ భరత్ రెడ్డి, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎల్కోటి జనార్ధన్ రెడ్డి, వసంత కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యజ్ఞేశ్వర్ రెడ్డి, మోహన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, జమీర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వడ్ల మోనప్ప, మాజీ ఉప సర్పంచ్ ఒబెదుర్ రహిమాన్, జేవీవీపీఎస్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ హాజమ్మ, బీఎస్పీ మండల అధ్యక్షుడు గౌతమ్, ఎంఐఎం జిల్లా నాయకులు పాషా, మునీర్, శక్తి ఫౌండేషన్ సభ్యులు నరేష్, ఉత్తేజ్, అర్ఫత్ అలీ, అశోక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## వివాహేతర సంబంధం కారణంగా వ్యక్తిపై హత్యాయత్నం

మరికల్ : మండల కేంద్రంలో వ్యక్తిపై శనివారం రాత్రి హత్యాయత్నం జరిగింది. ధన్వాడ ఎస్సై రాజశేఖర్, మరికల్ ఏఎస్సై ఎల్లయ్య కథనం మేరకు పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మరికల్ మండల కేంద్రానికి చెందిన లంబడి వెంకటేష్(45)ను అదే గ్రామానికి చెందిన బొండాల మల్లేష్ కొబ్బరి బోండాల కత్తితో దాడి చేశాడు. లంబాడి వెంకటేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స కోసం మరికల్ ప్రైవేట్ ఆసుపత్రిలో అక్కడి నుంచి మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వివాహేతర సంబంధమే దాడికి దారితీసిందని పోలీసులు తెలిపారు. నిందితుడు మల్లేష్ పరారీలో ఉన్నాడని, లంబాడి వెంకటేష్ భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసును నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వారు వెల్లడించారు. లంబడి వెంకటేష్ ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడినట్లు తెలిపారు.

## రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయకపోతే ప్రజలే బుద్ధి చెబుతారు : అందె బీరన్న



చేర్యాల : చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల ప్రజల ఆకాంక్ష మేరకు తక్షణమే చేర్యాల కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయకపోతే రానున్న ఎన్నికల్లో ప్రజలు అధికార పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తెలంగాణ కంట్రోల్ కమిటీ చైర్మన్ అందె బీరన్న అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందుకు జనగామ ఎన్నికల సభలో పీసీసీ అధ్యక్షుడి హెూదాలో ప్రభుత్వం ఏర్పాటు కాగానే రెవెన్యూ డివిజన్ ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదన్నారు.

నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఒక్క సభలో మాట్లాడ లేదని, ఎన్నికల ముందు గ్రామగ్రామాన చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పి సదరు వ్యక్తి నోరు విప్పడం లేదన్నారు. భువనగిరి ఎంపీగా గెలిచిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సైతం తాను విజయం సాధించిన వెంటనే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. డివిజన్ ఏర్పాటు కోసం ఈ నెల 25న జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే చేర్యాల బంద్‌కు అన్నివర్గాలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు పుల్ల ఆంజనేయులు, నాయకులు యాదయ్య, రాజు, తిరుపతి, నవీన్, వెంకటేశం, ఐలయ్య పాల్గొన్నారు.

# ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉంది

**మహిళా సాధికారతే లక్ష్యంగా కృషి**

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,**



రాజేంద్రనగర్( ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం కట్టుబడి ఉందని మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు వెళుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండల పరిధిలోని పెద్ద షాపూర్ లో ఎస్వీఆర్ గార్డెన్ లో శ్రీ శక్తి మహిళా వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అధికారులు నాయకులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సమాఖ్య సంఘాలకు వడ్డీ లేని రుణాలు పావలా వడ్డీ కింద 340 కోట్ల రూపాయలు మంజూరు చేయగా శంషాబాద్ మండలానికి 90 లక్షల రూపాయలు చెక్కులను మండల అభివృద్ధి అధికారులతో కలిసి మహిళా సంఘాలకు అందజేశారు. ఈ సందర్భంగా మహిళలు ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి కట్టుబడి ఉందన్నారు. అందుకోసమే వడ్డీ లేని రుణాలను అందించి వారి వ్యాపారాలు స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తుందన్నారు. మహిళలు కూడా ఈ నిధులను సద్వినియోగం చేసుకొని మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. మాజీ జెడ్పిటిసి నీరటి తన్విరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం అందించే వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళా సాధికారత లక్ష్యంగా ముందడుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డి ఆర్ డి ఓ జోజప్ప, డిపిఎం జయశ్రీ, మండల స్పెషల్ ఆఫీసర్ ఉల్లాస్, ఎంపీడీవో మున్ని, స్థానిక ప్రజాప్రతినిధులు మండల పార్టీ సీనియర్ నాయకులు చంద్ర రెడ్డి, ఆపరేటివ్ చైర్మన్లు శ్రవణ్ కుమార్ గౌడ్, దవణాకర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనే గౌని శ్రీకాంత్ గౌడ్, మహేందర్ ముదిరాజ్, కోటేశ్వర్ గౌడ్, గుడాల కృష్ణయ్య గౌడ్, కొడావత్ రవీందర్ నాయక్, మాజీ సర్పంచ్ సతీష్ యాదవ్, రమేష్ యాదవ్, నరసింహ ముదిరాజ్, జుర్కి రమేష్ పటేల్, ఉదయ్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళా సమాఖ్య సభ్యులు, పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ఆషాడ మాస బోనాలు




బడంగ్ పేట్ (ప్రశ్న న్యూస్) ఆషాడమాస బోనాల సందర్భంగా నగరంలో పండగ వాతావరణం చోటు చేసుకుంది. పలు కాలనీలలో ఉన్న అమ్మవారి ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. డప్పు మేళాలతో భారీ ఎత్తున మహిళలు బోనాలను ఎత్తుకొని అమ్మవారికు సమర్పించారు. బడంగ్ పేట్ మున్సిఫల్ కార్పొరేషన్ పరిధిలోని గాయత్రి హిల్స్, శ్రీ విద్యా టౌన్ షిప్ లోని శ్రీ మైసమ్మ తల్లి ఆలయంలో బోనాల పండగ వేడుకలు అంగరంగ వైభవంగా కన్నుల పండగగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండే భక్తులు తమ కుటుంబ సభ్యలతో కలిసి డప్పు వాయిద్యాల నడుమ బోనాలతో అమ్మవారిని దర్శించుకోవడం విశేషం. ఆలయ చైర్మెన్ నారాయణగౌడ్ మాట్లాడుతు మహిమాన్వితమైన శ్రీ మైసమ్మ తల్లీ భక్తులపాలిట కొంగుబంగారమై కొలచిన వెంటనే వరాలిచ్చే కల్పవల్లని తెలిపారు. బోనాల పండగ నేపద్యంలో మ్మవారి దర్శనానికి బోనాలతో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు వెంకటాచారి, సుధాకర్, తదితరులు పాల్గోన్నారు.

## నేడు కాచారం రాయన్నగూడలో బోనాలు

**బోనాల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

**టిఆర్ఎస్ యువ నాయకులు మహేష్ శాలివాహన**



రాజేంద్రనగర్(ప్రశ్న న్యూస్) నేడు కాచారం రాయన్నగూడలో జరిగే బోనాల మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిఆర్ఎస్ మండల యువ నాయకులు మహేష్ శాలివాహన అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండల పరిధిలోని కాచారం రాయన్నగూడలో ఆదివారం నిర్వహించే బోనాలు పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని గ్రామ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నామని వారు అన్నారు. బోనాల పండుగను భక్తుప్రపత్తులో జరుపుకోవాలని కోరుతున్నామని మహేష్ తెలిపారు. ప్రతి ఏటా ఎంతో వైభవంగా నిర్వహించే బోనాల పండుగ కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన అన్నారు.

## ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీ

**- వేములవాడ పట్టణంలో వ్యవసాయ శాఖ అధికారుల తనిఖీలు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలోని ఎరువుల దుకాణాలపై ఆదివారం వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లు ఎరువుల రికార్డులను సక్రమంగా నిర్వహించాల్సిందిగా అధికారులు ఆదేశించారు. రైతులకు ఎరువుల కృత్రిమ కొరత తలెత్తకుండా చూడాలని, ఎరువులు సమయానికి సరఫరా చేయాలనీ స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజు పాల్గొన్నారు. వారు దుకాణాలపై పలు సూచనలు చేస్తూ, నిబంధనల ప్రకారం మాత్రమే విక్రయాలు జరగాలని హెచ్చరించారు.

## ఆధ్యాత్మికతను సంతరించుకున్న బోనాల పండుగ

# గ్రామదేవతలకు ఘనంగా బోనాలు

**భాజాపా నాయకులు డాక్టర్ ప్రేమ్ రాజ్**





రాజేంద్రనగర్(ప్రశ్న న్యూస్) బోనాల జాతరతో గ్రామాల్లో ఆధ్యాత్మికత నెలకొందని భాజపా నాయకులు డాక్టర్ ప్రేమ్ రాజ్, చేవెళ్ల మహేందర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధిలోని తొండపల్లి గ్రామంలో జరిగిన బోనాల జాతర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీలు వారిని ఘనంగా సన్మానించారు. తదనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రేమ్ రాజ్ మాట్లాడుతూ బోనాల జాతర గ్రామదేవతలకు మొక్కులు తీర్చుకునే జాతర అని అన్నారు. ప్రతి ఏటా బోనాలు అమ్మవార్లకు ఎంతో వైభవంగా భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటారని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదాలు తో ప్రజలందరూ సుఖ సంతోషాలతో చల్లంగా చూడాలని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, భక్తులు, స్థానికులు,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సుదీర్ఘ విరామం అనంతరం పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

**- గత 50 ఏళ్ల అనంతరం**

**ఒకే వేదికపై సామూహిక కలయిక**

**- నాటి పూర్వ విద్యార్థులే..**

**నేటి ప్రముఖులు ఐన వైనం**





బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం గత 50 ఏళ్లక్రితం పాఠశాలలో చదువుకున్న అన్ని విద్యా సంవత్సరాల పూర్వ విద్యార్థులు సామూహికంగా (1975-2025 విద్యా సంవత్సరాలకు చెందిన) అపూర్వ కలయికకు విలాసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికైంది. ఆదివారం ఘనంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ముఖ్య అతిథిగా టీఎన్జీఓ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో మౌళిక సదుపాయాలు,పాఠశాల సమగ్ర అభివృద్ధి కి పాటుపడాలనే సదుద్దేశంతో ఒకే తాటిపై నిలబడి తమవంతుగా ఆర్థికసాయాన్ని అందించాలని నిర్ణయాన్ని తీసుకొని ఆదర్శంగా నిలిచారు.

**- నాటి పూర్వ విద్యార్థులు-నేటి ప్రముఖులు**

**- బోయినిపల్లి మండల మాజీ ఎంపీపీ, ప్రముఖ న్యాయవాది : పర్లపల్లి వేణుగోపాల్**

**- బోయినిపల్లి సెస్ డైరెక్టర్, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ జిల్లా సభ్యులు : కొట్టెపల్లి సుధాకర్**

**- వేములవాడ కోర్టు సూపరింటెండెంట్ : కొట్టెపల్లి అంజయ్య(జగ్గారావుపల్లి)**

**- కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, విలాసాగర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్: ఏనుగుల కనుకయ్య**

**- జగ్గారావుపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ : పోరెడ్డి మల్లారెడ్డి**

తదితరులు ఎందరో పూర్వ విద్యార్థులు సామూహికంగా తమ పాఠశాల శిథిలావస్థకు చేరిన తరుణంలో తగినన్ని నిధులు6సమీకరించి అభివృద్ధి చేసి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలనే దృఢ సంకల్పానికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన మారం జగదీష్ ను కొట్టెపల్లి సుధాకర్ శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు.

## వేములవాడ అర్బన్‌లో అభివృద్ధికి నాంది

**- గుర్రంవానిపల్లిలో బండి సంజయ్ సహకారంతో బోరు ఏర్పాటు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ అర్బన్ మండలంలోని గుర్రంవానిపల్లి గ్రామంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నిధుల సహాయంతో బోరు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా అర్బన్ మండల బీజేపీ అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ మాట్లాడుతూ, "రానున్న రోజుల్లో వేములవాడ అర్బన్ మండలాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్,భాజపా కేంద్ర నిధులతో అభివృద్ధి పథంలో నడిపిస్తాను" అని తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమానికి సహకరించిన నియోజకవర్గ ఇంచార్జి చెన్నమనేని వికాస్ రావు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్రంవానిపల్లి బీజేపీ నాయకులు కొలనూరి సంజీవరెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి, దామోదర్ రెడ్డి, జ్వాలా లక్ష్మారెడ్డి, జంగిటి శ్రీనివాస్, ముత్యం నాగరాజు, ముత్యం జోష్ణ, బుర్ర అంజనేయులు, పోచంపల్లి భాను సాయి గౌడ్, గుర్రం ప్రభాకర్ రెడ్డి, అభినయ్ రెడ్డి మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అమ్మవారి చల్లని చూపు అందరి పై ఉండాలి: గడ్డం సాయి కిరణ్





ఉప్పల్ (ప్రశ్న న్యూస్) హబ్సిగూడ డివిజన్ లో శ్రీశ్రీశ్రీ త్రిశక్తి నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో ఘనంగా బోనాల వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం సాయికిరణ్ మాట్లాడుతూ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన తర్వాత బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించామని చుట్టుపక్కల కాలనీలా నుండి బోనాలు అమ్మవారికి సమర్పించారని, భక్తులు కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి శ్రీశ్రీశ్రీ త్రిశక్తి నల్ల పోచమ్మ తల్లి ఆశీస్సులు అందరి పై ఉండాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీనియర్ పాత్రికేయులు ఓంకారం సంతోష్ రాజ్ ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పీసరి శంకర్, బోనగిరి శ్రీనివాస్ గుప్తా, సుదర్శన్ రెడ్డి, నరేష్ గౌడ్, సుధాగాని శ్యామ్ గౌడ్, నరేందర్ రాజు, నాగుల శ్రీనివాస్, ముసిగంపల శివ గౌడ్,అరవింద్, తోట శ్రీనివాస్, గోల్డ్ సంతోష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బయ్యారం పెద్ద చెరువులోకి వరద నీరు.. ఆశగా రైతుల ఎదురుచూపులు



బయ్యారం : కాకతీయ రాజులతో నిర్మించబడి ఎంతో ప్రాచుర్యం కలిగిన బయ్యారం పెద్ద చెరువులోకి వరద నీరు చేరుకుంటుంది. గత రెండు రోజులుగా వరంగల్ - ఖమ్మం సరిహద్దు గ్రామాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా.. పంది పంపుల వాగు, మసి వాగులు ప్రవహించి పెద్ద చెరువులోకి వరద నీరు చేరుకుంటుంది. పెద్ద చెరువు గరిష్ట నీటి మట్టం 16.2 అడుగులు కాగా.. ప్రస్తుతం 11 అడుగులకు చేరుకుంది. వర్షాలు కురిస్తే మరో ఐదు రోజుల్లో చెరువు అలుగు పారే అవకాశం ఉందని రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే పెద్ద చెరువు అలుగు నీటి ద్వారానే గార్ల మండలం సీతంపేటలోని పెద్ద చెరువు నిండుతుంది. అయితే అక్కడ వ్యవసాయ పనులు నిర్వహించేందుకు చెరువు నీటిని వదిలాల్సి ఉంటుంది. అయితే అలుగు పారే అవకాశం ఉండడంతో అక్కడి రైతులు బయ్యారం పెద్ద చెరువుకు అలుగు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రతి ఏటా జూన్ మొదటి లేదా రెండో వారంలోనే పెద్ద చెరువు అలుగు పారుతుండగా.. ఈ ఏడాది ఆలస్యం అవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పెద్ద చెరువులోకి నీరు చేరుతుండడంతో సందర్శకుల తాకిడి కూడా ప్రారంభమైంది.

## భారీ వర్షాలు, వరదలకు రోడ్డుపైకి కొట్టుకొచ్చిన చేపలు..



జైపూర్: భారీ వర్షాలు, వరదలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువలు, చెరువులు పొంగిపొర్లాయి. దీంతో చెరువుల్లోని చేపలు రోడ్లపైకి కొట్టుకువచ్చాయి. ఈ నేపథ్యంలో చేపలను పట్టుకునేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. గత రెండు రోజులుగా రాజస్థాన్‌లో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రాజధాని జైపూర్‌తోపాటు పలు జిల్లాల్లోని ప్రాంతాలు, గ్రామాలు జలమయమయ్యాయి. నదులు, డ్రైనేజీలు, ఆనకట్టలు పొంగిపొర్లడంతో అనేక గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. శనివారం కురిసిన భారీ వర్షం కారణంగా జోధ్‌పూర్-జైపూర్ హైవేలోని బనాద్ రోడ్డు మునిగిపోయింది. దీంతో వందలాది వాహనదారులు రహదారిలో చిక్కుకుపోయారు. కాగా, రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లా అతలాకుతలమైంది. భారీ వర్షాలకు లంపోలై చెరువు పొంగిపొర్లింది. దీంతో వరద నీటి ప్రవాహం వల్ల ఆ చెరువులోని చేపలు రోడ్లపైకి కొట్టుకువచ్చాయి. పదుల సంఖ్యలో చేపలు రహదారులపై ఈదుతూ కనిపించాయి. ఇది చూసి స్థానికులు ఆశ్చర్యపోయారు. మరికొందరు ఆ చేపలను పట్టేందుకు ప్రయత్నించారు.

## శివరాత్రి ని తలపించిన జనం




శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ముక్కంటీ శుని దర్శనం కోసం క్యూ లైన్ల లో నిరీక్షిస్తున్న భక్తులు వాయు లింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తజన సంద్రంగా మారింది వారాంతం సందర్భంగా ఆదివారం మహాశివరాత్రిని తలపించేలా రద్దీ నెలకొంది. అనుబంధం ఆలయం సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆడికృత్తిక మహోత్సవం సందర్భంగా భద్రతా సిబ్బంది చాలా వరకు అక్కడ విధులు నిర్వహించాల్సి వచ్చింది. దీంతో చాలీ చాలని సిబ్బందితో ఇబ్బందులు తప్పలేదు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో భక్తులు క్యూలైన్ల గూండా అడ్డదారిన వెళ్లడం, గంటల తరబడి నిరీక్షించలేక పలు దఫాలు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. స్వామి వారి ఆలయం వద్ద అందరూ ఒకేసారి దర్శనానికి వెళ్లేందుకు పోటీలు పడటంతో తోపులాట చోటు చేసుకుంది. ఉదయం నుంచి రాత్రి ఆలయం మూత వేసే సమయం వరకు భక్తులు క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. దాదాపు 30 వేల కు పైగా భక్తులు తరలివచ్చారు. ఇక రాహు కేతు పూజలు రికార్డ్ స్థాయిలో జరిగాయి. శీఘ్రదర్శనం టికెట్లు,అంతరాల దర్శనం టికెట్లు భారీగా అమ్ముడయ్యాయి. ప్రసాదాలు భారీగా అమ్ముడుపోయాయి.

## విజ్ఞానగిరిపై ఆడికృతిక బ్రహ్మోత్సవాలు అంబరాన్నంటాయి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అనుబంధ దేవాలయమైన విజ్ఞానగిరిపై ఆడికృతిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆడికృతిక బ్రహ్మోత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భక్తి ప్రవర్తలతో కావడిలు మోస్తూ హరోం హర అంటూ విజ్ఞానగిరి కొండపైకి చేరుకుంటున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నారద పుష్కరిణి వద్ద భక్తులు తలనీనాలు సమర్పించి ముక్కులు చెల్లించుకున్నారు. విజ్ఞానగిరిపై వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత



కుమారస్వామికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులు, సిబ్బంది పటిష్ట ఏర్పాట్లు చేశారు. భక్తులకు మౌలిక సదుపాయాలు, వసతులు దేవస్థానం అధికారులు కల్పించారు. ఆలయ అధికారులు, పలు శాఖల అధికారులు ఆడికృతిక బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

## మంత్రి గుమ్మడి సంధ్యారాణి ని కలిసిన తెలుగుదేశం పార్టీ నాయకురాలు బందిలి లక్ష్మి



నెల్లూరు బ్యూరో(ప్రశ్న న్యూస్) సుపరిపాలనలో తొలిగి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి , సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ని తెలుగుదేశం పార్టీ నాయకురాలు బందిలి లక్ష్మి ఆదివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## నూతన ఎస్సైని సన్మానించిన జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు పవన్ కళ్యాణ్



ఓజిలి (ప్రశ్న న్యూస్) నూతనంగా విధుల్లో చేరిన ఎస్సై గా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై కుద్రా శ్రీకాంత్ ను ఆదివారం ఓజిలి పోలీస్ స్టేషన్లో ఓజిలి రాచపాళెం జనసేన పార్టీ ఓజిలి మండల ఉపాధ్యక్షులు ఉప్పుటూరు పవన్ కళ్యాణ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు న్యాయం చేసే విధంగా సహకరించాలని కోరారు.మండలంలో శాంతి భద్రతలను కాపాడుటకు మావంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే సత్యం ప్రత్యేక చొరవతో గంజివాగు
# హై లెవెల్ వంతెన పనులు పునఃప్రారంభం

**- చొప్పదండి ఎమ్మెల్యే సత్యం కు ప్రజల ప్రత్యేక కృతజ్ఞతలు**

బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) బోయినిపల్లి మండలంలోని స్తంభంపల్లి గ్రామం సమీపంలోని గంజివాగు పై నిర్మించబడుతున్న హై లెవెల్ వంతెన పనులు గత కొన్ని రోజులుగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారాన్ని చొప్పదండి శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం ప్రజా పక్షాన గమనించి, ప్రత్యేక చొరవ తీసుకొని ఆదివారం నుంచి వంతెన పనులను మళ్లీ ప్రారంభించడానికి చర్యలు చేపట్టారు.పనుల పునఃప్రారంభానికి తగినంత నిధుల విడుదల,అధికారులు పని దారులతో(కాంట్రాక్టర్) సమన్వయం వంటి విషయాల్లో డాక్టర్ సత్యం చేసిన కృషి విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా



బోయినిపల్లి మండల ప్రజలు, స్తంభంపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కు, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



ఈ హై లెవల్ వంతెన పూర్తయితే స్థానిక ప్రజలకు రాకపోకలలో గల అసౌకర్యాలు తొలగిపోవడంతో పాటు రవాణా సౌలభ్యం కూడా మెరుగవుతుందని పలువురు స్థానికులు భావిస్తున్నారు.

# బోనమెత్తిన మేడ్చల్ ప్రజలు

**కన్నుల పండువగా బోనాలు**
**ప్రత్యేకంగా అమ్మవారి దేవాలయాల ముస్తాబు**
**విద్యుత్ దీపాలు.. పూలతో ప్రత్యేక అలంకరణ..**
**తెలంగాణలో జరుపుకునే పండుగల్లో బోనాలకు ప్రాధాన్యం**

**తెలంగాణలో అత్యంత వైభవంగా జరుపుకునే పండుగ బోనాలు. ఆషాఢమాసంలో నెలరోజుల పాటు కన్నుల పండువగా బోనాలను జరుపుకుంటారు.. గోల్కొండ కోటలో కొలువై ఉన్న జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడం ఆనవాయితీ. దాదాపుగా నెల రోజులపాటు బోనాల పండుగ జరుగుతుంది. ఇందులో చిన్నలు, పెద్దలు అనే తేడా లేకుండా అంతా కలిసి సంబురాలు చేసుకుంటారు. బోనాలు అంటే అమ్మవారికి భోజనం అని అర్థం. అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు మట్టి లేదా ఇత్తడి కుండలో పరమాన్నం వండి అమ్మవారికి సమర్పిస్తారు. కుండను పసుపు, కుంకుమతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. వేప కొమ్మలతో పాటు పైన దీపం వెలిగించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం జరిగిన బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. బోనాలంటేనే చుక్క, ముక్క ఉండాల్సిందే. తమ ఆర్థిక పరిస్థితులను బట్టి సంబురంగా జరుపుకునేదే బోనాల పండుగ**

మేడ్చల్( ప్రశ్న న్యూస్) తెలంగాణలో అన్నిరకాల పండుగలు జరుపుకుంటారు. చిన్న పండుగలను కూడా వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ముఖ్యమైన పండుగల్లో బోనాలకు అత్యంత ప్రాధాన్యం ఉంది. బోనాల పండుగకు బంధువులను పిలుచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆషాఢమాసంలో బోనాల పండుగ జరుపుకుంటారు. గోల్కొండ బోనాలు ప్రారంభమైన తరువాత ప్రాంతాల వారీగా ప్రారంభమవుతాయి. నెలరోజుల వ్యవధిలో అన్ని ప్రాంతాల్లో బోనాల పండుగ పూర్తి చేస్తారు. బోనాల పండుగకు సంబంధించి



రెండు రోజుల ముందు నుంచే దేవాలయాలు ముస్తాబయ్యాయి.

### తగ్గని చుక్క...ముక్క

బోనాల పండుగంటేనే చుక్క.. ముక్క ఉండాల్సిందే. అవి లేకుండా బోనాల పండగ జరుపుకోవడం కష్టమే. బోనాల పండుగకు తెలంగాణ ప్రజలు భారీగా ఖర్చు చేస్తారు. తమ తమ బంధువులను బోనాలకు ఆహ్వానిస్తారు. ఇందులో భాగంగానే మేడ్చల్ మండలంలో ఆదివారం బోనాల సందడి నెలకొంది. బోనమెత్తిన తరువాతే ఇంట్లో విందు ఏర్పాటు చేసుకున్నారు. తమ ఆర్థిక శక్తి కొలది పండుగను గణంగా జరుపుకున్నారు. ఆదివారం జరిగిన బోనాల పండుగకు బంధువులు, స్నేహితులను పిలుచుకుని దావత్ చేసుకున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అందుబాటులో లేకున్న మందు చుట్టు పక్కల మండలాల నుంచి తెప్పించుకుని మరి దావత్ చేసుకున్నారు. మెజార్టీ ప్రజలు ఇళ్లలో మాంసాహార గుమగుమలడాయి. రెండురోజుల ముందే గ్రామాల్లో పిండివంటలు చేసుకుని వచ్చే బంధువులకు పిండివంటలతో పాటు మాంసాహార రుచులు చూపించారు.

### కన్నుల పండుగగా బోనాలు



బోనాల పండుగ నేపథ్యంలో అమ్మవారి దేవాలయాలు



ప్రత్యేకంగా అలంకరించి రంగులు వేసి విద్యుత్ దీపాలతో పాటు పూలతో ముస్తాబు చేశారు. ఆదివారం రోజు బోనాల పండుగ వైభవంగా జరుపుకున్నారు. దీంతో మేడ్చల్ మండలంలో బోనాల పండగ ఉత్సాహంగా జరుపుకున్నారు. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. బోనాల పండుగకు ప్రత్యేక ఆకర్షణగా మైకులు ఏర్పాటు చేసి మైకుల్లో ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారి ప్రత్యేక పాటలతో మారుమోగాయి.

# అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

**- రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి**
**- సుపరిపాలన - తొలి అడుగులో మంత్రి గుమ్మడిసంధ్యారాణి ఆత్మీయ పలకరింపు**

నెల్లూరు బ్యూరో ( ప్రశ్న న్యూస్) అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకే సుపరిపాలనలో తొలిగి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. తిరుపతి జిల్లా నాయుడుపేట లోని ఎల్ ఏ సాగరంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట శాసన సభ్యురాలు ఎమ్మెల్యే విజయ శ్రీ ఆధ్వర్యంలో మంత్రికి నాయకులు పూల బుకెలు, శా లువలతో సత్కరించి స్వాగతం పలికారు. మహిళలు కర్పూర హారతులు పట్టి పూలబాట వేశారు. అనంతరం కాలనీలో పర్యటించి కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అనంతరం ఏఎంసి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్ల దుష్ట, దుర్మగ, సైకో పరిపాలన నుంచి విముక్తి పొంది ఏడాది పూర్తి చేసుకున్నామన్నారు. ఐరన్ లెగ్ జగన్మోహన్రెడ్డి అధికారంలోకి రాగానే మూడు సంవత్సరాలు కరోనా, రెండు సంవత్సరాలు శవాల ఓదార్పుతో సరిపోయిందన్నారు. రాష్ట్ర ప్రజలు గత ఐదేళ్ల పరిపాలనకు విసుగు చెంది వైసీపీ ని 11 సీట్లకే పరిమితం చేశారు. కూటమి ప్రభుత్వంపై విషం చల్లేందుకు బాబు షూరిటీ.. మోసం గ్యారంటీతో వస్తున్న వైసీపీ నాయకులను కాలర్ పట్టుకుని నిలదీయాలన్నారు. చంద్రబాబు నాయుడును ఇంకా బ్రతకడం అవసరమా అన్న పేర్ని నాని .. మనిషివా.. రాక్షసుడివా అని ప్రశ్నించారు. మీ ఇంట్లో తల్లిదండ్రులను కూడా వయస్సు మీరిందని చంపేస్తారా అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని, భారతదేశంలోనే ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యాలయాలను సైతం తాకట్టు పెట్టేశారన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు పథకాలను అమలు చేయనున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో



టీడీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### - సీఎం చంద్రబాబు తన రాష్ట్ర అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో సుపరిపాలన అందించినట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆమె తెలియజేశారు. రాష్ట్రంలో వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పా డి కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని ఇపుడు రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు మేలు చేస్తున్నాయని ఆమె తెలియజేశారు.

గత వైసిపి ప్రభుత్వం లో రాష్ట్రంలో ఎక్కడ కూడా ఏ విధమైన అభివృద్ధి జరగలేదు సంక్షేమమని చెప్పి సంక్షేమం కూడా ఇవ్వలేని పరిస్థితి దాపురించింది రాష్ట్రంలోకూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో అన్ని ప్రభుత్వ శాఖలను గాడిలో పెట్టి నా ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కే దక్కిన ఘనత అని చెప్పారు.

రాష్ట్రంలో రూ. 200 ఉన్న పింఛనను రూ. 2వేలు చేసింది, గత ప్రభుత్వం రూ. 3వేలు వేలు చేసిన పింఛనను ఒకేసారి రూ. 4 వేలకు పెంచిన సీఎం చంద్రబాబు పేదల పక్షపాతిగా చిరకాలం నిలిచిపో తారన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యులు, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, టీడీపీ జిల్లా అధ్యక్షులు నరసింహ యాదవ్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట మునిసిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, మాజీ జడ్పీటీసీ పేరం శెట్టి శ్రీ రామ్ ప్రసాద్, జనసేన పార్టీ ఇంచార్జ్ ఉయ్యాల ప్రవీణ్, నాయకులు గున్నం మధుసూదన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఆకుతోట రమేష్, సంచి కిష్టయ్య, ఓజిలి మండల అధ్యక్షులు గుజ్జలపూడి విజయ్ కుమార్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, డాక్టర్ దార అంకయ్య, పొట్లపూడి రాజేష్, రవీందర్ రెడ్డి, దార్ల రాజేంద్ర, కోటేశ్వరరావు, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.



# బిజినెస్ ఉమెన్ సమంత

స్టార్ హీరోయిన్ సమంత్ బిజినెస్ స్టార్ చేయబోతోంది. సినిమాలు, వెబ్ సిరీస్ లతో బిజీగా ఉన్నా.. ఈమధ్యనే నిర్మాతగా శుభం సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చింది. చిన్న సినిమాగా వచ్చిన శుభం.. బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. సినిమాలతోపాటు ఇకపై వ్యాపారాలపైనా సామ్ ఫోకస్ చేయాలని భావిస్తుందట.

ఇప్పుడు సామ్ స్టార్ట్ చేసిన బిజినెస్.. అదే లగ్జరీ పెర్ ఫ్యూమ్స్. దీనికి సంబంధించిన కాన్సెప్ట్ నుంచి బ్రాండింగ్ వరకు అన్నీ తానే దగ్గరుండి చూసుకుంటుందట. ప్రొడక్ట్ రెడీ అయ్యాక తానే బ్రాండ్ అంబాసిడర్ గా మారి మార్కెటింగ్ కూడా చేయాలని భావిస్తుందట. ప్రోడక్ట్ విషయంలో సమంత భారీ స్థాయిలో ఖర్చుపెడుతున్నారని తెలుస్తోంది. హీరోయిన్ గా, నిర్మాతగా, వ్యాపారవేత్తగా కూడా సమంత దూసుకు వెళ్తున్నారు. ఈ కొత్త వ్యాపారంలోనూ సమంత విజయం సాధించాలని ఆమె అభిమానులు కోరుకుంటున్నారు.

# బాలీవుడ్‌లో మరో స్టార్ హీరోతో శ్రీలీల



ఇన్నాళ్లు టాలీవుడ్ ఇండస్ట్రీలో వరస సినిమాలతో దూసుకుపోయిన శ్రీలీల.. ఇప్పుడు బాలీవుడ్ పై ఫోకస్ పెట్టింది. హిందీలో ఇప్పుడు ఈ అమ్మడు బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో బిటౌన్ లో బిజీ అవుతోంది. లేటెస్ట్ గా ఈ బ్యూటీ మరో స్టార్ హీరో సినిమాలో ఛాన్స్ కొట్టేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం శ్రీలీల హిందీలో కార్తిక్ ఆర్యన్ సరసన ఓ లవ్ స్టోరీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇదివరకే ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్స్, సాంగ్స్ రిలీజ్ అయ్యాయి. ఇక ఇప్పుడు బాలీవుడ్ లో మరో ఆఫర్ కొట్టేసినట్లుగా తెలుస్తోంది. ఈ స్టార్ హీరో మరెవరో కాదు.. రణవీర్ సింగ్. రణవీర్ హీరోగా వస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ మూవీలో శ్రీలీల హీరోయిన్ గా నటించనున్నట్లు టాక్. ఇప్పటికే ఆమెతో సంప్రదింపులు జరిపారని.. త్వరలోనే దీనిపై అఫిషియల్ అనౌన్స్మెంట్ రానుందని ప్రచారం జరుగుతుంది. ఈ చిత్రంలో బాబీ డియోల్ కీలకపాత్రలో నటిస్తున్నారు. రణవీర్ సినిమాతోపాటు శ్రీలీలకు హిందీలో మరిన్ని ఆఫర్స్ వస్తున్నట్లు బాలీవుడ్ టాక్. ఇటు టాలీవుడ్ తో పాటు అటు బాలీవుడ్ లో నూ స్టార్ ఇమేజ్ సొంతం చేసుకోవడం ఖాయంగా తెలుస్తోంది.

## బాలీవుడ్‌లో సంచలనం సృష్టిస్తున్న 'సైయారా'.. రెండు రోజుల్లోనే రూ.45 కోట్ల వసూళ్లు!



బాలీవుడ్‌లో చిన్న సినిమాగా విడుదలై రికార్డులు సృష్టిస్తున్న చిత్రం 'సైయారా' ప్రేక్షకుల అంచనాలకు మించి ఈ చిత్రం తొలి రెండు రోజుల్లోనే ఏకంగా రూ.45 కోట్ల భారీ వసూళ్లను రాబట్టి బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. సాధారణంగా భారీ బడ్జెట్‌తో, పెద్ద స్టార్లతో తెరకెక్కే చిత్రాలు మాత్రమే ఈ స్థాయిలో వసూళ్లను సాధిస్తుంటాయి. అయితే, 'సైయారా' చిత్రం కంటెంట్ బలంగా ఉంటే చిన్న చిత్రాలు కూడా పెద్ద విజయాలను నమోదు చేయగలవని మరోసారి నిరూపించింది. ఆషికి 2, ఏక్ విలన్, ఆవరాపన్, వంటి చిత్రాలతో బ్లాక్ బస్టర్‌లు అందుకున్న దర్శకుడు మోహిత్ సూరి ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. ఈ చిత్రంతో ఆహాన్ పాండే, అనిత్ పడ్డా బాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చారు. లవ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం ఎటువంటి మౌత్‌టాక్ లేకుండా బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. తొలిరోజే రూ.21 కోట్ల వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం రెండో రోజు రూ.24 కోట్లు వసూళ్లను రాబట్టింది. దీంతో చాలా రోజుల తర్వాత బాలీవుడ్‌కి మంచి హిట్ వచ్చిందని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు 'సైయారా' టీమ్ ఈ అనూహ్య విజయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తోంది.

# ఐదు నిమిషాలకే నిద్రలోకి..



భారీ తారాగణంతో వచ్చే సినిమాలపై ప్రేక్షకులతోపాటు సినీ తారలూ ఆసక్తి చూపుతారు. 'ఎప్పుడెప్పుడు బిగ్ స్క్రీన్‌పై వీక్షిద్దామా?' అని కళ్లల్లో ఒత్తులు వేసుకొని ఎదురుచూస్తుంటారు. ప్రీమియర్ షోలు వేస్తున్నారంటే.. ఎగబడిమరీ వెళ్తుంటారు. అయితే, షారుక్ ఖాన్–దీపికా పదుకొణె జంటగా ఫరాఖాన్ దర్శకత్వంలో వచ్చిన 'హ్యాపీ న్యూ ఇయర్' ప్రీమియర్ షో మాత్రం.. అందుకు భిన్నంగా సాగిందట. షో మొదలైన ఐదు నిమిషాలకే.. సినిమా తారాగణమంతా నిద్రలోకి జారిపోయిందట. ఈ విషయాన్ని ఇటీవల సినిమా దర్శకురాలు ఫరాఖాన్ వెల్లడించింది. 'హ్యాపీ న్యూ ఇయర్ కోసం మేము చాలా కష్టపడ్డాం. వరుసగా 40 రోజులపాటు భారత్‌లోని ప్రధాన నగరాల్లో ప్రమోషన్లు నిర్వహించాం. ఆ తరవాత మరో 20 రోజులు విదేశాల్లోనూ పర్యటించాం. ప్రమోషన్ల కోసం ఒక టీవీ షోను కూడా ప్రారంభించాం. ఇక సినిమా ప్రీమియర్ షోను దుబాయ్‌లో ఎంతో గ్రాండ్‌గా ఏర్పాటుచేశాం. సినిమాలో నటించిన సూపర్ స్టార్లందరూ దీనికి హాజరయ్యారు. వాళ్లంతా సినిమా చూసేందుకు ఎంతో ఆసక్తి చూపారు. ఉత్సాహంగా ముందు వరుసలో కూర్చున్నారు. కానీ, షో ప్రారంభమైన ఐదు నిమిషాల్లోనే అందరూ నిద్రలోకి జారుకున్నారు. ఎందుకంటే.. క్షణం తీరికలేకుండా ప్రమోషన్ కార్యక్రమాల్లో పాల్గొన్నాం. రాత్రిపూట అలా కుర్చీల్లో కూర్చోగానే.. కావాల్సినంత విశ్రాంతి దొరికినట్లు అనిపించింది' అంటూ చెప్పుకొచ్చింది ఫరాఖాన్. ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. తమకు అంతమంచి అవకాశం ఇస్తే.. కుర్చీల్లోంచి లేవకుండా చూసేవాళ్లమని కామెంట్లు పెడుతున్నారు. 2014లో షారుక్, దీపిక జంటగా తెరకెక్కిన 'హ్యాపీ న్యూ ఇయర్' నిర్మాణానికి రూ.150 కోట్లు ఖర్చయ్యాయి. బాక్సాఫీస్ దగ్గర ఈ సినిమా రూ.400 కోట్లదాకా కలెక్ట్ చేసింది. 2014లో అత్యధిక వసూళ్లు రాబట్టిన బాలీవుడ్ చిత్రాలలో ఒకటిగా నిలిచింది.

# చిరు సినిమాకూ తప్పని లీకులు



మెగాస్టార్ చిరంజీవి హీరోగా నయనతార హీరోయిన్ గా టాలీవుడ్ బ్లాక్ బస్టర్ దర్శకుడు అనీల్ రావిపూడి కాంబినేషన్ లో చేస్తున్న సినిమా కోసం అందరికీ తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం కేరళలోని అలప్పుజాలో అందమైన లొకేషన్స్ లో జరుగుతోంది. కేరళ షెడ్యూల్ నుంచి ఈ సినిమాకు సంబంధించిన ఓ వీడియో, కొన్ని ఫోటోలు లీకయ్యాయి. అయితే ఈ సినిమాపై కొన్ని లీక్స్ బయటకు రావడంతో మేకర్స్ షాకయ్యారు. దీనిపై లేటెస్ట్ గా మేకర్స్ అఫీషియల్ ప్రెస్ నోట్ విడుదల చేసి హెచ్చరిక జారీ చేశారు. పర్మిషన్ లేకుండా సెట్స్ నుంచి తీసిన కంటెంట్ ను లీక్ చేయడం ఆపాలని లేదంటే చర్యలు తప్పవన్నారు. సినిమా కోసం తామెంతో కష్టపడుతున్నామని, ఇలాంటి లీకులు జరిగితే తమ కష్టమంతా వృధా అవుతుందని, సినిమాపై ఉన్న ఇంట్రెస్ట్ ను ఈ లీకులు నాశనం చేస్తాయని మేకర్స్ తెలిపారు. లీకైన కంటెంట్ ను ఎవరైనా షేర్ చేసినా, ఎక్కడైనా అప్‌లోడ్ చేసినా వాటిని గుర్తించి వారికి కాపీరైట్ వేయడంతో పాటూ పైరసీ వ్యతిరేక చట్టాల ప్రకారం కఠినమైన చర్యలు కూడా తీసుకుంటామని మేకర్స్ హెచ్చరించారు. తామెంతో ప్రేమతో తెరకెక్కిస్తున్న మెగా157 సినిమాకు ఆడియన్స్ కూడా మద్దతు ఇవ్వాలని, ఇలాంటి లీకులను ఎంకరేజ్ చేయకూడదని నిర్మాతలు కోరారు. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలున్నాయి. చిరంజీవి కెరీర్లోనే ఇది బెస్ట్ మూవీగా నిలుస్తుందని అందరూ భావిస్తున్నారు. ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ ఓ స్పెషల్ రోల్ చేయనుండగా, కేథరీన్ థ్రెసా కీలక పాత్రలో నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమాను 2026 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా అనిల్ రావిపూడి షూటింగ్ వేగంగా చేస్తున్నారు.

# 'కూలీ' స్కేల్ చాలా పెద్దది – శృతిహాసన్



కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ లీడ్ రోల్ లో నటించిన కూలీ మూవీ రిలీజ్ కు సిద్ధమవుతోంది. యాక్షన్ థ్రిల్లర్ గా కోలీవుడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తెరకెక్కిస్తున్న ఆ సినిమాను సన్ పిక్చర్స్ బ్యానర్ పై కళానిధి మారన్ గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. యంగ్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీంతం అందిస్తున్నారు. ఆడియన్స్ లో ఇప్పటికే భారీ అంచనాలు క్రియేట్ చేసుకున్న కూలీ సినిమా కోసం భారీ క్యాస్టింగ్ ను రంగంలోకి దించారు మేకర్స్. టాలీవుడ్ కింగ్ నాగార్జున, బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్, ఉపేంద్ర, సత్యరాజ్ నటిస్తున్నారు. హీరోయిన్ శృతి హాసన్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాలో ప్రీతిగా సందడి చేయబోతోంది. ఇప్పటికే ఫస్ట్ లుక్ రిలీజ్ చేయగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. చేతిలో ఆయుధంతో ఉన్న శృతి.. సీరియస్ లుక్ లో కనిపించారు. ఈ మూవీపై , లోకేష్ కనగరాజ్ వర్కింగ్ స్టైల్ పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు శృతి. "లోకేష్ సినిమాలన్నింటిలో ఒక కామన్ థింగ్ ఉంటుంది. ఆయన సినిమాల్లో యాక్షన్, హై–ఆక్టేన్ స్టఫ్ కచ్చితంగా ఉంటుంది. అంతే కాదు ఒక ఎమోషనల్ కోర్ కూడా ఉంటుంది. ఇప్పుడు కూలీలో కూడా అవున్నాయి. అయితే కూలీ స్కేల్ చాలా పెద్దది. మిగతా వాటికంటే ఈ సినిమా భిన్నంగా ఉంటుంది" అని చెబుతూ అంచనాలు పెంచేసిందీ అమ్మడు. ఆగస్టు 14వ తేదీన వరల్డ్ వైడ్ గా భారీ స్థాయిలో రిలీజ్ కానున్న కూలీ మూవీతో శృతిహాసన్ ఎలాంటి హిట్ అందుకుంటారో వేచి చూడాలి.

# 'వార్ 2' ట్రైలర్ రన్ టైం లాక్



బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్, యంగ్ టైగర్ ఎన్‌టీఆర్ లీడ్ రోల్ చేస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'వార్ 2'. ఈ మూవీ ట్రైలర్‌కు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపు 2 నిమిషాల 39 సెకన్ల నిడివి గల ఈ ట్రైలర్‌కు ఖ/యూ సర్టిఫికేట్‌ను జారీ చేసింది. దీంతో ఈ ట్రైలర్‌ను మేకర్స్ వచ్చే వారం విడుదల చేయనున్నట్లు సమాచారం. అయాన్ ముఖర్జీ డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్, ఆగస్టు 14న రిలీజ్ కాబోతుంది. ఈ మూవీ ట్రైలర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచడం ఖాయమని మేకర్స్ అంటున్నారు. ఇది యశ్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో వస్తున్న ఆరవ సినిమా. హృతిక్ రోషన్ కబీర్‌గా తిరిగి రాగా, తారక్ ప్రతినాయకుడి పాత్రలో బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది.

## బోనాల పండుగా అమ్మవారికి నైవేద్యాలు మెండుగా

## అంగరంగ వైభవంగా జె. పి. మహానగర్ లో బోనాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వేపాకు తోరణాలు డప్పు చప్పుళ్ల పోతురాజుల విన్యాసాలు అమ్మవారి పూనకాలు లయబద్ధమైన పదనర్తనలతో నగరంలో ఎటు చూసినా బోనాలు సందడిగా మారాయి. బాలాపూర్ మండలంలోని జె. పి. మహానగర్ లో కొలువై ఉన్న అమ్మ వారి ఆలయంలోనూ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకోడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారి ఆశీస్సుల కోసం v బోనాలతో తరలివచ్చిన మహిళలే ఎక్కువగా కన్పించారు. సామూహికంగా బోనాలు సమర్పిస్తూ సౌభాగ్యాలను ప్రసాధించాలని అమ్మవారిని వేడుకున్నారు .ఆషాడమాసంలో ఆఖరి ఆదివారం కావడంతో అమ్మ వారి దివ్యసన్నిధిని పుష్పాలంకరణతో శోభామానంగా తీర్చిదిద్దారు. తద్వారా ఆలయ సందర్శన ప్రత్యేక అనుభూతినిచ్చింది. ఆషాడమాసంలో శక్తి స్వరూపిణి అమ్మవారిని ఆరాధిస్తే సకల శుభాలు ప్రాప్తిస్తాయని తమ ప్రగాఢ విశ్వాసమని అక్కడి భక్తులు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ బృందం భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# వర్షం పడితే గ్యాస్ రీఫిల్ దొరకదా?

- తిప్పాపూర్ గ్యాస్ గోదాం రహదారి అస్తవ్యస్తం
- ఇసుక,కంకరతో నీటి నిల్వలు..! దారి దిగ్బంధం..!!
- రీఫిల్‌కు వచ్చిన ప్రజలు బురదలో.. నానుతూ అవస్థలు..!
- స్పందించని మున్సిపల్ అధికారులు

వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ సమీపంలో ఉన్న భారత్ గ్యాస్ గోదాంకు వెళ్లే ప్రధాన రహదారి వర్షాల దెబ్బకు పూర్తిగా దెబ్బతిన్నది. రహదారి మొత్తం బురద నీటితో కప్పివేసి,జలమయం అయింది. ఈ దారిలో గ్యాస్ గ్యాస్ బండ రీఫిల్ కోసం వచ్చే వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. వాహనాల రాకపోకలు కష్టంగా మారాయి.

### రహదారి పక్కనే డంపింగ్... సమస్యకు మూలం

రాజన్న ఆలయ సమీపంలోని గోశాలలో జరుగుతున్న రోడ్డు పనుల కోసం కాంట్రాక్టర్ ఇసుక,కంకరలను రహదారి పక్కనే డంప్ చేయడం వల్ల వర్షపు నీరు నిల్వ అవుతోంది. ఫలితంగా సకాలంలో నీరు వెళ్లేందుకు దారి లేక,రహదారి పరిస్థితి ఎప్పుడు ఎలా ఉంటుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

### వినియోగదారుల అవస్థలు

"గ్యాస్ అవసరం తో వచ్చాం...! గ్యాస్ బండ తీయడమే కాదు కదా... వెళ్లడానికి కూడా దారే లేదు. పట్టణ ప్రజలకు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం మున్సిపల్, సంబంధిత అధికారులకు లేదా?? అంటూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది బైక్‌లు నీటిలో మగ్గిపోయి,బురదలో పడి పడుతున్న అవస్థల దృశ్యాలు స్థానికులను కలచివేస్తున్నాయి.





### ప్రజల డిమాండ్- వెంటనే చర్యలు తీసుకోవాలి

స్థానికులు మున్సిపల్,గ్యాస్ కంపెనీ,కాంట్రాక్టర్ అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు. "రోజూ వర్షం కురుస్తోంది, అయినా స్పందించని అధికారులు ఎందుకని? " అంటూ ప్రశ్నిస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకుని రహదారిని పునరుద్ధరించాలని,రీఫిల్ సేవలు సజావుగా ఉండేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

## అమ్మవారి చల్లని చూపు అందరి పై ఉండాలి: పుండరీ చారి



అంబర్ పేట (ప్రశ్న న్యూస్)పటేల్ నగర్ లోని నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సీనియర్ జర్నలిస్టు జూలూరు పుండరీ చారి దంపతులుబోనాల వేడుకల సందర్భంగా ఆదివారం ఉదయం అంబర్ పేట డివిజన్ పటేల్ నగర్ చౌరస్తాలోని శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో హైదరాబాద్ జర్నలిస్ట్ యూనియన్( హెచ్ యు జె) ఉపాధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు జూలూరు పుండరీ చారి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రసాద వితరణ చేయడం జరిగింది ఈ సందర్భంగా జూలూరు పుండరీ చారి మాట్లాడుతూ బోనాల వేడుకలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచాయని ఆయన కొనియాడారు, ఘటాల ఊరేగింపు పలహార బండ్ల ఊరేగింపు ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు కుటుంబ సభ్యులు జూలూరు శ్రీదేవి. జూలూరు కావ్య శ్రీ, అక్కిన పల్లి నైన శ్రీ ,పోలోజు చంద్రకళ,పోలోజు ప్రశాంత్, పోలోజు స్వరూపారాణి,పోలోజు వరుణ్,పోలోజు వకులేశ్వరి, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ దేవాలయంలో ఘనంగా బోనాల పండుగ



నాచారం(ప్రశ్న న్యూస్) నాచారం డివిజన్ లోని ఎర్రకుంట పోచమ్మ ఆలయంలో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారు జాము నుండే అమ్మవారికి బోనం సమర్పించి తమ ముక్కలు తీర్చుకున్నారు. బీజేపీ నాయకుడు రాగిరీ మోహన్ రెడ్డి జ్యోతి దంపతుల తోపాటు ఇమ్మడి రామచందర్ రెడ్డి, లావణ్య, మధుసూదన రెడ్డి పద్మ దంపతులు అమ్మవారి కి బోనం సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు నర్సింగ్ రావు, బిక్షపతి, వాసు, శ్రీమూర్తి నాగరాజు, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా మౌళిక వసతుల కల్పనే మా లక్ష్యం

- ప్రజల భాధ్యతే ప్రభుత్వ ప్రాధాన్యత
- రాష్ట్ర ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్
- హన్మాజీపేట,మర్రిపల్లి బ్రిడ్జీలు ప్రారంభించిన ఎమ్మెల్యే - ఆది శ్రీనివాస్



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట నక్క వాగుపై రూ.11.55 కోట్ల వ్యయంతో నిర్మించిన హై లెవెల్ బ్రిడ్జిని, కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపై నిర్మించిన మర్రిపల్లి బ్రిడ్జిని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు కనీస మౌళిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. గతంలో వర్షాకాలంలో నక్క వాగు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంగతి గుర్తుచేస్తూ, అదే సమయంలో బ్రిడ్జి పనులు తక్షణమే ప్రారంభించి వర్షాకాలానికి ముందే పూర్తి చేస్తామన్న హామీని నేడు నెరవేర్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రత్యేకంగా వేములవాడ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా, రాజన్న ఆలయ పట్టణ అభివృద్ధి, కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ నిర్మాణం వంటి పలు పెండింగ్ పనులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తామని వివరించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడుతోందని పేర్కొన్న ఆయన, ప్రభుత్వ ఏర్పాటు అనంతరం 48 గంటలలోనే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి పథకాలు అమలయ్యాయని గుర్తు చేశారు. అదే విధంగా ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి పథకాలతో పాటు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా కూడా కొనసాగుతోందని వెల్లడించారు. గత పాలకులు పదవులను హెూదాల కోసం ఉపయోగించారన్న విమర్శలు చేస్తూ, తాము మాత్రం ప్రజాసేవకే కట్టుబడి ఉన్నామని, రాబోయే రోజుల్లో ప్రతిష్టాత్మక పథకాల ద్వారా ప్రతీ గ్రామ అభివృద్ధికి పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు.

## కొండ పోచమ్మకు మొక్కులు చెల్లించిన రెడ్డి సంఘ యువజన సభ్యులు

### తడగొండలో ఘనంగా బోనాల వేడుకలు



బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, తడగొండ గ్రామంలో ఆదివారం జరిగిన ఆషాఢ మాస బోనాల సందర్భంగా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండుగ కార్యక్రమాలు నిర్వహించారు. కొండ పోచమ్మ అమ్మవారికి యువత ప్రత్యేకంగా పాల్గొని,ప్రత్యేక పూజలు నిర్వహించి,బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సంఘ యువ సభ్యులు మాట్లాడుతూ, "అమ్మవారి కృపతో ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలి. ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలి," అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘ యువకులు, గ్రామ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమ్మవారికి బోనం సమర్పించిన గోపాల్ గౌడ్ దంపతులు



నాచారం(ప్రశ్న న్యూస్)పవిత్ర ఆషాడ బోనాల జాతర సందర్భంగా నాచారం డివిజన్ పరిధిలోని పోచమ్మ ఆలయంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ దంపతులు అమ్మవారికి బోనం సమర్పించి అమ్మవారి దివ్య కటాక్షములు అందుకున్నారు. ఈ సందర్భంగా గోపాల్ గౌడ్ మాట్లాడుతూ ఈ పవిత్ర ఆషాడ మాసంలో ఆ అమ్మవారికి బోనాన్ని సమర్పించి చేసుకునే బోనాల పండగను అందరు భక్తి శ్రద్ధలతో చేసుకోసుకుని ఆ అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందుకోవాలని కొరారు. ఆ అమ్మవారి దివ్య కృపాకటాక్షలు, దీవెనలు, ఆశీస్సులు నాచారం ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలియచేసారు.

## విజ్ఞానగిరి లో పులకరించిన భక్తులు స్కందునికి కావళ్ల సమర్పణ.



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)దశ్రీకాళహస్తిలో ఆడికృత్తిక సందడి విజ్ఞానగిరిపై దర్శనం కోసం క్యూలైన్లల్లో బారులు తీరిన జనం భక్తిశ్రద్ధలతో కావడి సమర్పించుకుంటున్న బాలుడు హరో హర నామస్మరణలతో శ్రీకాళహస్తి మార్మోగింది. ఆడికృత్తిక మహెూత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం విజ్ఞానగిరిపై కొలువుదీరిన స్కంధుని దర్శించుకునేందుకు వచ్చిన భక్తజన ప్రవాహంతో ఇక్కడి క్షేత్రంలో సందడి వాతావరణం నెలకొంది. పసుపు వస్త్రాలను ధరించి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించి కావళ్లు పట్టుకుని శరవణభవుని నామస్మరణతో కావళ్ల మొక్కు సమర్పించుకున్నారు. ఆదివారం, సోమవారం రెండు రోజులు కృత్తిక నక్షత్రం ఉండటం తో మధ్యాహ్నం నుంచి విజ్ఞానగిరి భక్తజన సంద్రంగా మారింది భక్తుల మధ్య తొక్కిలసలాటలు లేకుండా క్యూలైన్లను పకడ్బందీగా ఏర్పాటు చేశారు నారద పుష్కరిణిలోను ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. ఆడికృత్తిక సందర్భంగా విజ్ఞానగిరిపై కొలువుదీరిన కుమారస్వామికి విశేష పూజ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం చందనరూపుడై భక్తులకు దివ్యదర్శనం కల్పించారు. ఆడికృత్తిక సందర్భంగా ఇంద్రవిమానంపై శ్రీ వల్లి దేవసేన సమేతుడైన సుబ్రహ్మణ్య స్వామిని చతుర్మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు ఉదయం నుంచి రాత్రి వరకు 70వేల మంది వరకు భక్తులు దర్శనం చేసుకుని ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు.

## అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలి

### పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



అంబర్ పేట (ప్రశ్న న్యూస్) బోనాల పండుగ సందర్భంగా పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అంబర్ పేట్ మహంకాళి అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోనాల పండుగను అంబర్ పేట్ నియోజకవర్గంలో అంగరంగ వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్ , బింది మల్లికార్జున్, శ్రీమంత్ గిరి , కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్టు సాయి కుమార్ గంగపుత్రకు జన్మదిన శుభాకాంక్షలు

- తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)నాంపల్లిలోని బంగారు మైసమ్మ ఆలయము ప్రాంగణములో తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మెన్ మెట్టు సాయి కుమార్ గంగపుత్ర జన్మదినం పురస్కరించుకొని బంగారు మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు అనంతరం తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మెట్టు సాయి కుమార్ గంగపుత్రను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శు భాకాంక్షలు తెలిపిన అనంతరం తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుచూ తెలంగాణలోని సంప్రదాయ మత్యకార గంగపుత్రులకు మాత్రమే మత్య పారిశ్రామిక సహకార సంఘాలలో సభ్యత్వాలు కల్పించే విధముగా తెలంగాణ రాష్ట ప్రభుత్వము నుండి ప్రత్యేక ఉత్తర్వులు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు.

## అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలి: ముసిగంపల శివ గౌడ్



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) వెంకట్ రెడ్డి నగర్ లో శ్రీ శ్రీశ్రీ త్రిశక్తి నల్ల పోచమ్మ ఆలయంలో అంగరంగ వైభవంగా బోనాల పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా హబ్సిగూడ డివిజన్ ఓ బి సి ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ అంగరంగ వైభవంగా బోనాలను సమర్పించామని ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు. ముసిగంపల కృష్ణ గౌడ్, భాగ్యమ్మ, నరేష్ గౌడ్ అశ్విని రాజేశ్వరి, హరీష్ గౌడ్, సౌజన్య, నాని, జస్విక్, రిత్విక్, పప్పు, అమ్మవారిని దర్శించుకున్నారు.

# సీజింగ్ నోటీసులున్నా ఆగని నిర్మాణం

**- కోర్టు ఆదేశాలను బేఖాతర్, నోటీసులున్నా ఆగని నిర్మాణం**

**- కాప్రాలో యథేచ్ఛగా కొనసాగుతున్న వాణిజ్య సముదాయ పనులు**

**- ప్రభుత్వ భూమి, ముస్లిం గ్రేవియార్డ్ స్థలమంటూ కోర్టులో కేసులు**








**కాప్రా (ప్రశ్న న్యూస్)** కాప్రా సర్కిల్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ముస్లిం గ్రేవియార్డ్‌కు ఆనుకుని జరుగుతున్న ఒక వ్యాపార భవన నిర్మాణం వివాదానికి దారితీస్తోంది. ఇది అక్రమంగా జరుగుతోందని, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, తప్పుడు పత్రాలు సృష్టించి, జీహెచ్ఎంసీ అనుమతులు పొందారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై ఇప్పటికే కోర్టులో కేసులు నడుస్తున్నప్పటికీ, భవన నిర్మాణ పనులు మాత్రం యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. వివరాల్లోకి వెళ్లితే స్థానికుల కథనం మేరకు ఇక్కడి స్థలం ప్రభుత్వానికి చెందినదని, 23 గుంటల ముస్లిం గ్రేవియార్డ్ స్థలంలో భాగమని చెబుతున్నారు. ఈ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని, ఏదైనా ఉంటే కోర్టులో చెప్పాలని కోర్టు స్టే విధించింది. అయితే, కోర్టు స్టే ఆదేశాలు ఉన్నప్పటికీ, బిల్డర్ వాటిని పట్టించుకోకుండా నిర్మాణ పనులు కొనసాగిస్తుండటం గమనార్హం. దీనిపై ముస్లిం గ్రేవియార్డ్ పెద్దలు హైకోర్టులో కోర్టు ధిక్కరణ కేసు దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ కేసు విచారణలో ఉంది. మరోవైపు, జీహెచ్ఎంసీ కూడా సదరు నిర్మాణానికి సీజింగ్ నోటీసులు జారీ చేసింది. అయినప్పటికీ సదరు బిల్డర్ అవేమి పట్టించుకోకుండా తనదైన శైలిలో రాత్రి పగలు శరవేగంగా నిర్మాణ పనులను చేయిస్తూ మీరు ఏమి చేయగలరు అన్నట్లుగా అధికారులకే సవాల్ విసురుతున్నాడు. ఇక్కడి నిర్మాణదారుడికి బడా నాయకుల అండ ఉందనే ప్రచారం కొనసాగుతోంది. సదరు బిల్డర్ పలువుర్ని బెదిరింపులకు గురిచేస్తు నిర్మాణ పనులను కొనసాగిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవటం లేదని నిర్మాణ పనులు పూర్తి చేసుకుంటూనే మరోవైపు వాట్ వాష్ వేస్తూ వాణిజ్య సముదాయాన్ని ప్రారంభించే దిశగా అడుగులు వేస్తున్నారు. అయితే సదరు బిల్డరు హుడా లేవుట్ అంటూ ఏలాంటి ఆదారాలు చూపకుండానే అధికారులను తప్పుదోవ పట్టిస్తూ యథేచ్ఛగా నిర్మాణపనులను కోనసాగిస్తున్నా వారిపై తగిన చర్యలు చేపట్టాలని ముస్లీం గ్రేవియార్డు సభ్యులు కోరుతున్నారు.

## టౌన్ ప్లానింగ్ ఏసిపి స్పందించేనా.?

కాప్రా సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఎసిపి కృష్ణమోహన్ స్పందించడం లేదని అనేక ఫిర్యాదులు వచ్చిన అక్రమ నిర్మాణాలపై అసలు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమ నిర్మాణదారులు ముందుగానే సిబ్బందిని, అధికారులను కలసి కావలసిన నైవేద్యం అందించి అక్రమ నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నారని దీనిపై వెంటనే జిహెచ్ఎంసి కమిషనర్, విజిలెన్స్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


Vacation Civil Judge,
Medchal-Malkajgiri District, at Kushaiguda.

SCHEDULE OF PROPERTY

All that the encroached area i.e., admeasuring 126.66 Sq. Yards or 105.88 Sq. Mtrs SRO Kapra vide document No.4258/2022 i.e., Open Plot No.3, S.P. in Sy.No.483, situated at Sriramnagar colony, Kapra, Medchal Malkajgiri District bounded by:

NORTH : Plot No.3 North Part
SOUTH : Plot No.2
EAST : Plot No.13 and 14
WEST : 60' wide road

Vacation Civil Judge,
Medchal-Malkajgiri District, at Kushaiguda.
Prl. Dist. & Sessions Judge
Cum-Judge
Medchal Malkajgiri District

In the Court of
Prl.District & Sessions Judge
Medchal Malkajgiri District
C.A. No. 6196/25
C.A. Filed On 30/5/25
Copy Stamps Called On 5/6/25
Court Fee 8/-
Copy Stamps Deposited On 5/6/25
Copy Made Ready On 6/6/25
Copy Delivered On 6/6/25
Superintendent

Compared by:-
Certified True Photo Copy
Superintendent
Central Copying Section
Prl Dist. & Sessions Judge
Medchal Malkajgiri District

# జోరుగా వాటర్ ప్లాంట్ల దందా

**- అనధికార వాటర్ ప్లాంట్ల సంగతేంటి.?**

**- మామూళ్ళ మత్తులో పురపాలక, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు**

**- వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరి**

**- నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్లు**

**- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వాటర్ ప్లాంట్ల యాజమాన్యం**

**వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిలో ఆంతర్యమేమిటని మేడ్చల్ మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తిలా పాపం తలా పిడికెడు అన్న చందంగా మామూళ్ళు తీసుకుని పురపాలక శాఖ, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు మాకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహారిస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని అధికారుల తీరుపై జోరుగా చర్చ నడుస్తోంది. పైన తెలిపిన మూడు పురపాలక సంఘం పరిధిలో వాటర్ ప్లాంట్లు అనధికారికంగా నడుస్తున్నాయి. ఒకటికి అనుమతులు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు యథేచ్ఛగా నడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదేమిటని ప్రశ్నించే అధికారులు లేకపోవడంతో అంతా మా ఇష్టం అన్నట్లుగా ఎక్కడ పడితే అక్కడ నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్లు నడుపుతున్నారు.**

మేడ్చల్ (ప్రశ్న న్యూస్)
అనధికార వాటర్ ప్లాంట్ల సంగతేంటని వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిలో ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తిలా పాపం తలా పిడికెడు అన్నచందంగా మామూళ్ళు తీసుకొని పురపాలక సంఘం, ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు మాకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించడంతో అధికారుల తీరుపై చర్చ నడుస్తోంది. మూడు పురపాలక సంఘాల పరిధిలో వాటర్ ప్లాంట్లు అనధికారికంగా నడుస్తున్నాయి. అనుమతులు తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు యదేచ్ఛగా నడుపుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించే అధికారులే లేకపోవడంతో అంతా మా ఇష్టం అన్నట్లుగా ఎక్కడి పడితే అక్కడ నిబంధనలకు తూట్లు పొడిచి వాటర్ ప్లాంట్లు నిర్వహిస్తున్నారు. బోరు ఉంటేనే ఆ ప్లాంట్ కు అనుమతులివ్వాలి కానీ ఒక్క వాటర్ ప్లాంట్ లో కూడా బోరు కనపడటం లేదు. పురపాలక శాఖ అధికారులు, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు త్రాగునీటిని పరీక్షించకుండా ఇష్టారాజ్యాంగా వాటర్ ప్లాంట్లకు అనుమతులిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాటర్ ప్లాంట్ల పేరుతో సకాలంలో మినరల్ నీరు అందిస్తామని నిర్వాహకులు దోపిడీ చేస్తున్నారు. వాటర్ ప్లాంట్ లో మినరల్ కు బదులు ఫ్లోరిన్ నీరు సరఫరా చేసి ప్రజలను రోగాల పాలు చేస్తున్నారు. ఇప్పటికే మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలో ఫ్లోరిన్ నీళ్ళను త్రాగి కీళ్ళ నొప్పులతో బాధపడుతున్నామని పలువురు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దూరపు ప్రాంతాల్లో బోర్లలో త్రాగునీరు వాటర్ ట్యాంకుల్లో నింపి మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని మినరల్ ట్యాంకుల్లో చూపించి శుద్ధజలాలను మినరల్ పేరుతో విక్రయాలు చేస్తున్నారు. ఇదంతా పురపాలక సంఘం అధికారుల కనుసన్నల్లో నడుస్తుందని సమాచారం. వాటర్ ప్లాంట్ ను నడిపే యాజమాన్యంతో నెలనెలా మామూళ్ళకు ఒప్పందాలు చేసుకొని ఆ వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పుట్టగొడుగుల్ల వాటర్ ప్లాంట్లను నిర్మించి సామాన్య ప్రజలను మినరల్ వాటర్ పేరుతో దోపిడీ చేస్తున్నారు. 20 లీటర్ల త్రాగునీటిని రూ.25లకు విక్రయాలు చేసి యదేచ్ఛగా దోచుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా పురపాలక సంఘం, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోరు.

నెల నెలా మామూళ్ళు తీసుకొని వాటర్ ప్లాంట్లపై యాజమాన్యంపై చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వాటర్ ప్లాంట్ల యాజమాన్యంపై చర్యలు తీసుకొని, నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లను సీజ్ చేసి ప్రజలకు అండగా నిలవాలని మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు డిమాండ్ చేసున్నారు. మేడ్చల్ మండలంలో మినరల్ వాటర్ పేరుతో దందా జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోతే మారుమూల ప్రాంతాల్లో మినరల్ వాటర్ పేరుతో దందాచేసే వారిపై చర్యలు ఎలా తీసుకుంటారని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పురపాలక సంఘం పరిధిలో అనధికారికంగా నడిపే వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని సామాన్య ప్రజలు, పేద మధ్యతరగతి కుటుంబాలు డిమాండ్ చేస్తు అవినీతి అధికారులపై వేటు వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




# బోనాల ఉత్సవాలు విజయవంతం

**- హర్షం వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** చారిత్రాత్మక గోల్కొండలో వెలసిన జగదాంబిక ఎల్లమ్మ తల్లికి ఆషాడ మాసం తొలి బోనం సమర్పించడంతో జంటనగరాల్లో మొదలైన బోనాల ఉత్సవాలు దేవాదాయ శాఖ, ఇతర శాఖల కృషి, పర్యవేక్షణతో నెల రోజుల పాటు జరిగిన బోనాల ఉత్సవాలు విజయవంతం కావడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక సంస్కృతికి ప్రతీక బోనాల పండుగ అన్నారు. ప్రకృతితో మమేకమై జీవించే వ్యవసాయ ఆధారిత సమాజ సాంప్రదాయ సామూహిక తాత్వికత, బోనాల పండుగ సందర్భంగా తెలంగాణ గడ్డమీద నుంచి ప్రపంచానికి ప్రదర్శితం అవుతుందన్నారు. తెలంగాణ సాంప్రదాయానికి అద్దంపట్టే బోనాల జాతరతో రాష్ట్రమంతటా ఆధ్యాత్మకత ఉట్టిపడిందన్నారు. గోల్కొండలో మొదటి బోనంతో ప్రారంభమైన ఆషాఢ బోనాల జాతర లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారికి బోనం సమర్పించడంతో బోనాల ఘటం ముగుస్తుందన్నారు. బోనాల ఉత్సవాలు విజయంతం కావడానికి కృషి చేసిన అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.

# అమ్మా.. ప్రజలను చల్లగా చూడు : పొంగులేటి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బోనాల పండుగ సందర్భంగా.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి యూసుఫ్ గూడ లక్ష్మినర్సింహనగర్ లోని పోచమ్మ దేవాలయంలో జరిగిన వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా.. రాష్ట్ర ప్రజలందరికీ ఆయన బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని.. ప్రజలందరూ సుఖ శాంతులతో చల్లగా చూడాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అమ్మవారిని వేడుకున్నారు. రాష్ట్రం సిరి సంపదలతో.. తులతూగాలని.. వర్షాలు మంచిగా కురిసి పంటలు బాగా పండాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి వెంట.. నీటి వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ముువ్వా విజయ్ బాబు, స్థానిక కాంగ్రెస్ నాయకులు.. చిన్న శ్రీశైలం యాదవ్, నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

# దుష్టశక్తులు అంటూ విజయశాంతి ఫైర్

**- టీడీపీపై పరోక్షంగా విమర్శలు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బోరబండ పోచమ్మ బోనాల ఉత్సవాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి పాల్గొన్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు చేశారు. పోరాటాలు చేసి తీసుకొచ్చిన ప్రత్యేక రాష్ట్రం తెలంగాణలోకి కొన్ని దుష్టశక్తులు రావడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. తెలంగాణ అనేది అక్షయపాత్ర అని... దోచుకోడానికి మళ్లీ ప్రయత్నాలు జరుగుతున్నాయని విజయశాంతి విమర్శించారు. ప్రతి ఒక్కరూ ధర్మం వైపు నడవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ నాశనం కోరుకుంటున్న వారికి వినాశనం తప్పదు. గుడ్ మార్నింగ్, గుడ్ ఈవెనింగ్ కాదు.. పిడికిలి బిగించి గుండెపై చేయి వేసి జై తెలంగాణ అనండి.

తెలంగాణ ప్రజల గుండెల్లోనే తెలంగాణ ఉంది, ఎవరు విచ్ఛిన్నం చేయలేరు. పేద ప్రజల పార్టీ కాంగ్రెస్ పార్టీ. త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఎన్నికలు ఎప్పుడూ జరిగినా కాంగ్రెస్ పార్టీదే విజయం. ఏ ఎన్నిక వచ్చినా బాబా ఫసీయుద్దీన్ కుటుంబం గెలవాలని కోరుకుంటున్నా'అని ఎమ్మెల్సీ విజయశాంతి చెప్పారు. రాష్ట్రంలో టీడీపీని ఏపీ సీఎం చంద్రబాబు బలోపేతం చేయబోతున్నారన్న వార్తలపైనే విజయశాంతి స్పందించినట్టు చెబుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588